

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS


మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 14-06-2026 | సంపుటి - 29 | సంచిక -20 | రూ : 4 | పేజీలు: 8

## సింగరేణి ప్రైవేటీకరణకు భాజపా, భారాసల కుట్ర

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ఆదిలాబాద్, మంచిర్యాల పట్టణం, దండేపల్లి గ్రామీణం: భారాస పదేళ్ల పాలనలో కేంద్రంలోని భాజపా ప్రభుత్వంతో కలిసి సింగరేణి సంస్థను ప్రైవేటుపరం చేసేందుకు కుట్రలు చేసిందని, తాము అధికారంలోకి వచ్చాక వాటిని అడ్డుకోవడంతో మాపై బురదజల్లే ప్రయత్నం చేస్తోందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మండిపడ్డారు. మాజీ మంత్రి హరీశ్‌రావు అబద్ధాలరావుగా మారారని ఎద్దేవాచేశారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సింగరేణికి రావాల్సిన వాటాలను ప్రైవేటు సంస్థలకు చెందేలా ప్రయత్నాలు చేశారని ఆరోపించారు. మంచిర్యాలలో శనివారం సాయంత్రం మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్,

తరువాయి 2లో



## 1.44 లక్షల మందికి బ్రేక్‌ఫాస్ట్



- తొలి విడతలో 1,269 పాఠశాలలు... 33 కళాశాలల్లో అమలు
- రేపు 8 జిల్లాల్లో ప్రారంభం
- హరే కృష్ణ మూమెంట్... మన్నా ట్రస్ట్‌లకు బాధ్యతలు

హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో బ్రేక్‌ఫాస్ట్ పథకానికి ఈ నెల 15న రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. అందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. తొలి విడత మొత్తం 1,302 విద్యాసంస్థల్లో ప్రారంభించనుంది. అందులో 1,269 పాఠశాలలు, 33 కళాశాలలు ఉన్నాయి. వాటిల్లోని మొత్తం 1,44,610 మంది విద్యార్థులకు వారంలో ఆదివారం మినహా మిగిలిన ఆరు రోజులు ఉదయం పూట అల్పాహారం అందనుంది. పథకాన్ని సెంట్రలైజ్డ్ కిచెన్ల ద్వారా విడతల వారీగా కొత్త విద్యా సంవత్సరంలోనే రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అమలు చేస్తారు. మొత్తం 33 జిల్లాల్లో 39 చోట్ల కేంద్రీకృత కిచెన్ల నిర్మాణానికి రూ.299.90 కోట్లు ఖర్చవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది.

తరువాయి 2లో

## జీ7 వేదికగా మోదీ, ట్రంప్ భేటీ..
## ఈ నెల 17న కీలక చర్చలు



- జీ7 సదస్సులో భాగంగా ప్రధాని మోదీ, ట్రంప్ భేటీ
- జూన్ 17న ఫ్రాన్స్‌లో ఇరువురు నేతల సమావేశం
- ద్వైపాక్షిక వాణిజ్యం, ప్రాంతీయ భద్రతపై చర్చల అంచనా
- భారత నావికుల మృతి సహా పలు ఉద్రిక్తతల నడుమ ఈ భేటీ

2లో

## పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌లో తెలంగాణ పోలీసులకు జాతీయ పురస్కారం



2లో

- పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌లో తెలంగాణ పోలీసులకు జాతీయ అవార్డు
- కేంద్ర విదేశాంగ శాఖ నుంచి ప్రతిష్ఠాత్మక పురస్కారానికి ఎంపిక
- 'వెరిఫాస్ట్' యాప్ ద్వారా వేగవంతమైన సేవలకు గుర్తింపు
- జూన్ 19న అవార్డు అందుకోనున్న డీజీపీ సీవీ ఆనంద్

## భారత సైన్యానికి కొత్త చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్

- కొత్త ఆర్మీ చీఫ్‌గా ధీరజ్ సేథ్
- జూన్ 30న బాధ్యతల స్వీకరణ
- ఉపేంద్ర ద్వివేది అదే రోజు రిటైర్
- 1986లో సైన్యంలో చేరిన సేథ్
- పలు కీలక కమాండ్లకు నాయకత్వం
- సైన్యం ఆధునికీకరణలో కీలక పాత్ర

2లో



## నేడే ఒప్పందం



డొనాల్డ్ ట్రంప్ | షెహబాజ్ షరీఫ్ | అబ్బాస్ అరాగ్చీ

- తెరుచుకోనున్న హర్మూజ్ జల సంధి
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన
- అంతకుముందు పాక్ ప్రధాని నోట అదే మాట
- ఇరాన్ నుంచీ సానుకూల సంకేతాలు
- అయితే అమెరికా వైఖరిని బట్టి తదుపరి నిర్ణయం ఉంటుందని స్పష్టీకరణ

2లో




## భారత్ అరుదైన ఘనత.. ఖండాంతర క్షిపణులనూ అడ్డుకునే సామర్థ్యం!

2లో

- ఐసీబీఎం స్థాయి ముప్పును అడ్డుకునే సామర్థ్యం భారత్ సొంతం
- వరుసగా మూడు BMD ఫ్లైట్ టెస్టులు సక్సెస్
- ఈ సామర్థ్యం ఉన్న అతికొన్ని దేశాల జాబితాలో భారత్
- నేవల్ యాంటీషిప్ మిసైల్ తొలి పరీక్ష విజయవంతం

# సింగరేణి ప్రైవేటీకరణకు భాజపా, భారాసల కుట్ర

*** డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

మంచిర్యాల గ్రామీణం: భారాస పదేళ్ల పాలనలో కేంద్రంలోని భాజపా ప్రభుత్వంతో కలిసి సింగరేణి సంస్థను ప్రైవేటుపరం చేసేందుకు కుట్రలు చేసిందని, తాము అధికారంలోకి వచ్చాక వాటిని అడ్డుకోవడంతో మాపై బురదజల్లే ప్రయత్నం చేస్తోందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మండిపడ్డారు. మాజీ మంత్రి హరీశ్‌రావు అబద్ధాలరావుగా మారారని ఎద్దేవాచేశారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సింగరేణికి రావాల్సిన వాటాలను ప్రైవేటు సంస్థలకు చెందేలా ప్రయత్నాలు చేశారని ఆరోపించారు. మంచిర్యాలలో శనివారం సాయంత్రం మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, సింగరేణి సీఎండీ బుద్ధ ప్రకాశ్‌జ్యోతితో కలిసి 335 మంది సింగరేణి కార్మికుల వారసులకు కారుణ్య నియమాక పత్రాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. 'కిషన్‌రెడ్డికి తెలంగాణపై ప్రేమ ఉంటే 2023లో తాడిచెర్ల2 బ్లాక్ సింగరేణికి దక్కేలా చూసేవారు. ఈ విషయంపై నేనే లేఖ రాసి, పలుమార్లు స్వయంగా కలిస్తే స్పందించకపోగా.. సత్తుపల్లి3, కోల్‌బ్లాక్3, కొయ్యగూడ వేలంలో కూడా సింగరేణి పాల్గొనకుండా చేశారు. ఆయనకు అనుకూలమైన ఇద్దరు ప్రైవేటు వ్యక్తుల కోసం సింగరేణి రూ.9,746 కోట్ల లాభం కోల్పోయేలా కుట్రపూరితంగా వ్యవహరించారు. దీనిని లెక్కాపత్రాలతో నిరూపించడానికి నేను సిద్ధం. ఎట్టి పరిస్థితుల్లో సింగరేణిని ప్రైవేటుపరం కానివ్వం. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం కొలువుదీరిన తర్వాత రూ.1.25 కోట్ల చొప్పున సింగరేణి కార్మికులకు ప్రమాద బీమా ప్రకటించాం. సంస్థ లాభాల్లో రెగ్యులర్ కార్మికులతోపాటు కాంట్రాక్టు కార్మికులకు కూడా బోనస్ అందించేలా విధానపరమైన నిర్ణయం తీసుకున్నాం. భాజపా రాజ్యాంగాన్ని, ఎన్నికల సంఘాన్ని ప్రభావితం చేస్తోంది. వారికి నచ్చిన వారినే గెలిపించేలా దాన్ని తయారు చేస్తోంది. మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరించటం అందులో భాగమే. ప్రజాస్వామ్యానికి ఇది ప్రమాద ఘంటిక' అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు అధ్యక్షత వహించగా ఎంపీ వంశీకృష్ణ, ఎమ్మెల్సీలు దండె విఠల్, ఎమ్మెల్యేలు వినోద్, మక్కాన్‌సింగ్, గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ కుమార్‌దీపక్ తదితరులు పాల్గొన్నారు.

## జీ7 వేదికగా మోదీ, ట్రంప్ భేటీ..

# ఈ నెల 17న కీలక చర్చలు

భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫ్రాన్స్‌లో సమావేశం కానున్నారు. జీ7 శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ఈ నెల 17న వీరిద్దరి మధ్య ద్వైపాక్షిక చర్చలు జరగనున్నట్లు వైట్‌హౌస్ శనివారం ధ్రువీకరించింది. పలు అంశాలపై ఇరు దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ భేటీ అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ఆతిథ్యమిస్తున్న జీ7 సదస్సు జూన్ 15 నుంచి 17 వరకు జరగనుంది. ఈ సదస్సుకు భారత్‌ను అతిథ్య దేశంగా ఆహ్వానించారు. ఇందులో పాల్గొనేందుకు ఆరు రోజుల విదేశీ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ ఫ్రాన్స్‌కు చేరుకున్నారు. ఈ పర్యటనలో ఆయన ఫ్రాన్స్, స్లోవేకియా దేశాల్లో పర్యటించనున్నారు. 2025 ఫిబ్రవరిలో ట్రంప్ తిరిగి అమెరికా అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన తర్వాత మోదీ, ట్రంప్‌లు నేరుగా సమావేశం కానుండటం ఇదే తొలిసారి. ఈ భేటీలో ప్రధానంగా ద్వైపాక్షిక వాణిజ్య చర్చలు, ఇంధన సహకారం, ప్రాంతీయ భద్రత వంటి అంశాలు ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉంది. అయితే, ఈ సమావేశంలో తక్షణమే భారీ వాణిజ్య ఒప్పందాలు కుదిరే సూచనలు లేవని అమెరికా అధికారులు తెలిపారు. ఈ చర్చల అనంతరం అమెరికా వాణిజ్య ప్రతినిధి జేమిసన్ గ్రీర్ భారత్‌లో పర్యటించనున్నారు. ఇటీవల కాలంలో ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు కొంత క్లిష్టంగా మారాయి. భారత ఎగుమతులపై అమెరికా విధిస్తున్న సుంకాలు, రష్యా నుంచి భారత్ ఇంధన కొనుగోళ్లు వంటి అంశాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా, ఒమన్ తీరంలో అమెరికా చేపట్టిన చర్యల కారణంగా ముగ్గురు భారతీయ నావికులు ప్రాణాలు కోల్పోవడంపై భారత్ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో జరగనున్న ఈ భేటీ, ఇరు దేశాల మధ్య సంబంధాలను పునరుద్ధరించి, తిరిగి గాడిన పెట్టడానికి ఒక కీలక అవకాశంగా విశ్లేషకులు భావిస్తున్నారు.

# 1.44 లక్షల మందికి బ్రేక్‌ఫాస్ట్

హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో బ్రేక్‌ఫాస్ట్ పథకానికి ఈ నెల 15న రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. అందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. తొలి విడత మొత్తం 1,302 విద్యాసంస్థల్లో ప్రారంభించనుంది. అందులో 1,269 పాఠశాలలు, 33 కళాశాలలు ఉన్నాయి. వాటిల్లోని మొత్తం 1,44,610 మంది విద్యార్థులకు వారంలో ఆదివారం మినహా మిగిలిన ఆరు రోజులు ఉదయం పూట అల్పాహారం అందనుంది. పథకాన్ని సెంట్రలైజ్డ్ కిచెన్ల ద్వారా విడతల వారీగా కొత్త విద్యా సంవత్సరంలోనే రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అమలు చేస్తారు. మొత్తం 33 జిల్లాల్లో 39 చోట్ల కేంద్రీకృత కిచెన్ల నిర్మాణానికి రూ.299.90 కోట్లు ఖర్చవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. అందులో ఇప్పటికే ఉన్న 7 కిచెన్లను ఉన్నతీకరిస్తారు. మిగిలినవి కొత్తగా నిర్మిస్తారు. ఒక్కో కిచెన్‌కు ప్రభుత్వం తన వాటాగా 70% భర్తిస్తుంది. మిగిలిన 30% మొత్తాన్ని ఆయా స్వచ్ఛంద సంస్థలు ఖర్చు చేయనున్నాయి. కిచెన్ల నిర్మాణ బాధ్యతలను తెలంగాణ విద్యా సంక్షేమ, మౌలికాభివృద్ధి సంస్థ పర్యవేక్షిస్తుంది. ఇప్పటికే టెండర్లు ఖరారయ్యాయి.

- 22 లక్షలు: బ్రేక్‌ఫాస్ట్ పథకంతో లబ్ధి పొందనున్న రాష్ట్రంలోని మొత్తం ప్రీ ప్రైమరీ (పూర్వ పాథమిక) నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థుల సంఖ్య.
- రూ.720 కోట్లు: పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్ కోసం చేయనున్న ఖర్చు. వీటిలో అల్పాహారానికి రూ.540 కోట్లు, పాలకు రూ.180 కోట్లు.
- రూ.56 కోట్లు: ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేకంగా కేటాయించిన మొత్తం ఇది.
- పాలు/రాగి జావ: మూడు రోజులు పాలు, మరో మూడు రోజులు రాగి జావ ఇవ్వనున్నారు. ప్రీ ప్రైమరీ నుంచి 5వ తరగతి వరకు 75 మి.లీ., మిగిలిన తరగతుల వారికి 100 మి.లీ. చొప్పున పాలు అందజేస్తారు.
- 2 సంస్థలు... 8 జిల్లాలు: బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని హరే కృష్ణ మూమెంట్ ఛారిటబుల్ ట్రస్ట్, మన్నా ట్రస్ట్‌లు మొత్తం ఎనిమిది జిల్లాల్లో అమలు చేయనున్నాయి.
- హరే కృష్ణ మూమెంట్: వికారాబాద్, నారాయణపేట, సంగారెడ్డి, రంగారెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లాల్లోని 1,162 పాఠశాలల్లో...1,03,891 మంది విద్యార్థులు ప్రయోజనం పొందుతారు. వికారాబాద్, నారాయణపేట, హనుమకొండ, వరంగల్ జిల్లాల్లోని 21 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని 10,293 మందికి కూడా బ్రేక్‌ఫాస్ట్ అందుతుంది.
- మన్నా ట్రస్ట్: హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాల్లోని 107 పాఠశాలల్లో చదివే 26,294 మంది విద్యార్థులకు అందుతుంది. ఈ రెండు జిల్లాల్లో 12 కళాశాలల్లోని 4,132 మందికి కూడా లభిస్తుంది.

**> జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజనం**

- ప్రస్తుతం పాఠశాలలకే పరిమితమైన మధ్యాహ్న భోజన పథకాన్ని ఇక నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలలకూ విస్తరించనున్నారు. ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ఈ పథకం వర్తిస్తుంది. దీన్ని కూడా సోమవారం నుంచే 33 కళాశాలల్లో ప్రారంభిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 430 ప్రభుత్వ కళాశాలలున్నాయి. వాటిల్లో దాదాపు 1.70 లక్షల మంది చదువుతున్నారు.

# భారత సైన్యానికి కొత్త చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్

భారత సైన్యానికి కొత్త ఆర్మీ చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్‌ను కేంద్ర ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఆయన వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జూన్ 30న కొత్త ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది అదే రోజు పదవీ విరమణ చేయనున్నారు. దీంతో ధీరజ్ సేథ్ భారత సైన్యానికి తదుపరి అధిపతిగా బాధ్యతలు చేపట్టనున్నారు. సేథ్ నేషనల్ డిఫెన్స్ అకాడమీలో శిక్షణ పొందారు. 1986 డిసెంబర్‌లో ఆర్మర్డ్ కార్ప్స్‌లో అధికారిగా సైన్యంలో చేరారు. దాదాపు 40 ఏళ్లకు పైగా సాగిన సైనిక జీవితంలో కీలక బాధ్యతలు నిర్వహించారు. ఎడారి ప్రాంతాల్లో ఆర్మర్డ్ రెజిమెంట్‌కు నాయకత్వం వహించిన ధీరజ్ సేథ్, పశ్చిమ సరిహద్దు ప్రాంతంలో ఆర్మ్‌డ్ బ్రిగేడ్‌కు కమాండర్‌గా పనిచేశారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలను పర్యవేక్షించే దళాలకు కూడా నాయకత్వం అందించారు. లెఫ్టినెంట్ జనరల్ హోదాలో భారత సైన్యంలో అత్యంత కీలకమైన స్ట్రైక్ ఫార్మేషన్లలో ఒకటైన సుదర్శన్ చక్ర కార్ప్స్‌కు కమాండర్‌గా వ్యవహరించారు. ఢిల్లీ ప్రాంత జనరల్ ఆఫీసర్ ఇన్ కమాండింగ్‌గా కూడా పనిచేశారు. ఈ సమయంలో దేశీయ, అంతర్జాతీయ సైనిక కార్యక్రమాల సమన్వయం బాధ్యతలు నిర్వర్తించారు. సైన్యాన్ని ఆధునిక అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడంలో ధీరజ్ సేథ్ కీలక పాత్ర పోషించారు. సైనిక సామర్థ్యాల పెంపు, భవిష్యత్ వ్యూహాల రూపకల్పన, దళాల పునర్వ్యవస్థీకరణ వంటి అంశాల్లో ఆయన సేవలు విశేష గుర్తింపు పొందాయి.

## పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌లో

# తెలంగాణ పోలీసులకు జాతీయ పురస్కారం

తెలంగాణ పోలీసు శాఖ మరో ప్రతిష్ఠాత్మక జాతీయ పురస్కారాన్ని సొంతం చేసుకుంది. పాస్‌పోర్ట్ దరఖాస్తుల వెరిఫికేషన్ ప్రక్రియలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు గాను కేంద్ర విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలంగాణ పోలీసులను 'ఇన్‌స్టిట్యూషనల్ పెర్ఫార్మెన్స్ అవార్డ్ ఫర్ స్టేట్ పోలీస్ (2025 26)'కు ఎంపిక చేసింది. పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ ప్రక్రియను అత్యంత సమర్థవంతంగా, పారదర్శకంగా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వేగంగా పూర్తి చేస్తున్నందుకు ఈ గుర్తింపు లభించింది. ఈ నెల 19న ఢిల్లీలో నిర్వహించనున్న 'పాస్‌పోర్ట్ సేవా దివస్' వేడుకల్లో కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ చేతుల మీదుగా రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. తెలంగాణ పోలీసులు వెరిఫికేషన్ ప్రక్రియ కోసం ప్రత్యేకంగా రూపొందించిన 'వెరిఫాస్ట్' మొబైల్ యాప్‌ను వినియోగిస్తున్నారు. ఈ యాప్ ద్వారా దరఖాస్తుల పరిశీలనలో జాప్యాన్ని గణనీయంగా తగ్గించడంతో పాటు, ప్రక్రియ అంతటా పారదర్శకతను పెంచారు. జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకున్న ఈ వినూత్న విధానం, పౌర సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో తెలంగాణ పోలీసుల అంకితభావానికి నిదర్శనంగా నిలుస్తోంది.

# భారత్ అరుదైన ఘనత..

# ఖండాంతర క్షిపణులనూ అడ్డుకునే సామర్థ్యం!

రక్షణ రంగంలో భారత్ మరో కీలక మైలురాయిని చేరుకుంది. దీర్ఘశ్రేణి బాలిస్టిక్ క్షిపణులను గాల్లోనే అడ్డుకుని ధ్వంసం చేసే సామర్థ్యాన్ని డీఆర్‌డీఓ విజయవంతంగా పరీక్షించింది. సముద్రంలో శత్రు నౌకలను లక్ష్యంగా చేసుకొనే కొత్త క్షిపణి సామర్థ్యాన్నీ ప్రదర్శించింది. వరుసగా నిర్వహించిన మూడు ప్రయోగాత్మక పరీక్షలు విజయవంతం కావడంతో అత్యాధునిక క్షిపణి రక్షణ వ్యవస్థలు కలిగిన దేశాల సరసన భారత్ నిలిచింది. డీఆర్‌డీఓ నిర్వహించిన మూడు వరుస పరీక్షల్లో ఇంటర్‌సెప్టర్ క్షిపణులు తమ లక్ష్యాలను కచ్చితంగా ఛేదించాయి. బహుళస్థాయి బాలిస్టిక్ మిసైల్ డిఫెన్స్ వ్యవస్థ సామర్థ్యాన్ని ఈ పరీక్షలు నిరూపించాయి. ఆధునిక క్షిపణి ముప్పులను ఎదుర్కొనేలా రూపొందించిన ఈ వ్యవస్థ శత్రు బాలిస్టిక్ క్షిపణులను లక్ష్యానికి చేరకముందే నిర్వీర్యం చేయగలదని అధికారులు తెలిపారు. ఈ విజయాలతో భారత్ ప్రపంచంలోని కొన్ని దేశాలకే ఉన్న ప్రత్యేక సామర్థ్యాన్ని సొంతం చేసుకుంది. ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులు (ఐసీబీఎంలు) సహా అత్యంత ప్రమాదకరమైన క్షిపణి ముప్పును అడ్డుకునే రక్షణ వ్యవస్థను అభివృద్ధి చేసిన దేశాల జాబితాలో భారత్ చేరిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఇది దేశ భద్రతా వ్యవస్థకు కీలక బలాన్ని చేకూర్చనుంది. మరోవైపు నేవల్ యాంటీషిప్ మిసైల్ (మీడియం రేంజ్) తొలి ఫ్లైట్ టెస్ట్‌ను కూడా డీఆర్‌డీఓ విజయవంతంగా పూర్తి చేసింది. మధ్యశ్రేణి దూరంలో శత్రు యుద్ధ నౌకలను కచ్చితంగా లక్ష్యంగా చేసుకునే ఈ క్షిపణి భారత నౌకాదళ దాడి సామర్థ్యాన్ని మరింత పెంచనుంది. ఈ విజయాలపై డీఆర్‌డీఓ శాస్త్రవేత్తలను రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు.



## డ్రైవర్ గా మారిన సీఎం..

# 130 కిలోమీటర్లు డ్రైవ్ చేసిన విజయ్

తమిళనాడు రాజకీయాల్లో సంచలన విజయం సాధించి, ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించిన కోలీవుడ్ స్టార్ విజయ్ తనదైన స్టైల్‌తో అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు. పరిపాలన చేపట్టిన కొన్ని రోజులకే తన అసాధారణమైన శైలితో వార్తల్లో నిలుస్తున్నారు. తాజాగా నిన్న ఆయన కర్ణాటకలోని ప్రముఖ కొల్లూరు మూకాంబిక అమ్మవారి ఆలయాన్ని సందర్శించిన సంగతి తెలిసిందే. అయితే, అక్కడ దర్శనం ముగించుకున్న తర్వాత ఆయన చేసిన ఒక పని ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. గుడి నుంచి ఎయిర్‌పోర్ట్ వరకు దాదాపు 130 కిలోమీటర్ల మేర తన కారును ఆయనే స్వయంగా డ్రైవ్ చేసుకుంటూ వెళ్లారు. కొల్లూరు మూకాంబిక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన సీఎం విజయ్.. అమ్మవారికి 1.6 కేజీల బరువున్న భారీ వెండి ఖడ్గాన్ని కానుకగా సమర్పించారు. దాంతో పాటు పట్టుచీర, పండ్లు, పూజా సామగ్రిని అందజేశారు. దర్శనం ముగిసిన వెంటనే తన కాన్వాయ్‌లోని కారు డ్రైవింగ్ సీట్లో ఆయనే కూర్చుని ప్రయాణాన్ని ప్రారంభించారు. దారిలో ఒక టోల్ గేట్ వద్ద అభిమానులు ఆయనను గుర్తుపట్టి కేకలు వేయగా.. విజయ్ ఎంతో వినమ్రంగా స్టీరింగ్ పట్టుకునే నవ్వుతూ చేతులూపారు. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట విపరీతంగా వైరల్ అవుతోంది. తమిళనాడు రాజకీయ చరిత్రలో ఈ పర్యటనకు ఒక ప్రత్యేకమైన ప్రాధాన్యత ఉంది. తమిళనాడు ముఖ్యమంత్రి పదవిలో ఉంటూ కొల్లూరు మూకాంబిక ఆలయాన్ని సందర్శించిన మూడో తమిళనాడు సీఎం విజయ్ మాత్రమే. గతంలో తమిళనాడు దిగ్గజ నేతలు ఎం.జి. రామచంద్రన్, జయలలిత మాత్రమే సీఎం హోదాలో ఈ క్షేత్రాన్ని దర్శించుకున్నారు. ఇప్పుడు వారి తర్వాత విజయ్ ఆ సెంటిమెంట్‌ను రిపీట్ చేయడం గమనార్హం. జూన్ 22న విజయ్ తన 52వ పుట్టినరోజును జరుపుకోబోతున్నారు. బర్త్‌డేకి కొన్ని రోజుల ముందే ఈ ఆధ్యాత్మిక పర్యటన పెట్టుకోవడం.. అలాగే ప్రస్తుతం తమిళనాడు కర్ణాటక రాష్ట్రాల మధ్య కావేరి జలాల వివాదం నడుస్తున్న తరుణంలో ఆయన పొరుగు రాష్ట్రానికి వెళ్లడం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది.

# నేడే ఒప్పందం...

వాషింగ్టన్, ఇస్లామాబాద్: పశ్చిమాసియాలో శాంతి పవనాలు వీయనున్నాయా.. అమెరికాఇరాన్ మధ్య ఘర్షణ ముగియనుందా.. హర్మూజ్ జల సంధి తిరిగి తెరుచుకోనుందా... శనివారం జరిగిన పరిణామాలు ఆ దిశగానే సాగాయి. యుద్ధం ముగియనుందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్‌తో ఆదివారం ఒప్పందం కుదుర్చుకోనున్నామని ప్రకటించారు. సంతకాలూ జరుగుతాయని వెల్లడించారు. ఇరాన్ అణు కార్యక్రమాన్ని కూడా నాశనం చేస్తామని తెలిపారు. అంతకుముందు పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కూడా 24 గంటల్లో శాంతి ఒప్పందం కుదరనుందని ప్రకటించారు. ఇరాన్ మాత్రం ఆచితూచి స్పందిస్తోంది. చర్చలు జరుగుతున్నాయని.. తుది నిర్ణయం అమెరికా వైఖరిని బట్టి ఉంటుందని పేర్కొంది.

**ఆ యురేనియాన్ని నాశనం చేస్తాం**

ఇరాన్ అణ్వాయుధ కార్యక్రమాన్ని నాశనం చేసే దిశగా ఒప్పందం ఉంటుందని ట్రంప్ పేర్కొన్నారు. మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా గతంలో కుదుర్చుకున్న అణు ఒప్పందాన్ని తప్పుబట్టారు. 'గతంలో ఒబామా ఇరాన్‌తో కుదుర్చుకున్న ఒప్పందం ఆ దేశం సులభంగా అణ్వాయుధాలు తయారుచేసుకునేలా ఉంది. మా ఒప్పందం మాత్రం ఇందుకు పూర్తి విరుద్ధం. ఆ దేశ అణు కార్యక్రమానికి అడ్డుగోడగా నిలవనుంది' అని చెప్పారు. ఇరాన్ అణ్వాయుధ కార్యక్రమాన్ని ఇప్పటికే పూర్తిగా నిర్వీర్యం చేశామని, వారి దగ్గర ఉన్న శుద్ధి చేసిన యురేనియాన్ని తర్వాతి దశల్లో నాశనం చేస్తామని 'ట్రూత్ సోషల్'లో పేర్కొన్నారు. ''సరైన సమయంలో..అంతా ప్రశాంతంగా ఉన్నప్పుడు మేం ఇరాన్‌లోకి ప్రవేశించి గ్రానైట్ పర్వతాల కింద ఉన్న శుద్ధి చేసిన యురేనియాన్ని తీసుకొస్తాం'' అని చెప్పారు. ఇరాన్ అణుకేంద్రాలను బి2 బాంబర్లు నాశనం చేశాయని అన్నారు. దానివల్లే యురేనియం ఆ కుప్పకూలిన కొండల కింద చిక్కుకుపోయిందని తెలిపారు. తీసుకొచ్చిన యురేనియాన్ని శుద్ధి చేయని యురేనియంతో కలిపి ఇరాన్‌లో లేదా అమెరికాలో నాశనం చేస్తామని చెప్పారు. ఈ ప్రక్రియ వేగంగా, సులభంగా, ప్రశాంతంగా జరుగుతుందని ఆశిస్తున్నానని చెప్పారు.

**ఆదివారమైతే సంతకం చేయం: ఇరాన్**

శాంతి ఒప్పందంపై అంతకుముందు పాకిస్థాన్ కూడా కీలక ప్రకటన చేసింది. రానున్న 24 గంటల్లో ఒప్పందం కుదిరే అవకాశాలున్నాయని ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తెలిపారు 'గతంలో ఎన్నడూ లేనంతగా శాంతికి దగ్గరలో ఉన్నాం. రానున్న 24 గంటల్లో ఒప్పందం ఖరారయ్యే అవకాశాలున్నాయి. ఆ తర్వాత వెంటనే ఒప్పందంపై ఎలక్ట్రానిక్ సంతకాలు చేయించేందుకు మేం సిద్ధమవుతున్నాం. ఈ చరిత్రాత్మక శాంతి ఒడంబడిక సుస్థిర శాంతికి బలమైన పునాదులు వేస్తుందన్న విశ్వాసం మాకుంది' అని 'ఎక్స్'లో షరీఫ్ పేర్కొన్నారు. పాక్ ప్రధాని ప్రకటనను ఇరాన్ పూర్తిగా ఖండించలేదు. 'ఒప్పందంపై రేపు (ఆదివారం) సంతకం చేయబోం. రానున్న రోజుల్లో చేస్తామేమో. పూర్తిగా కొట్టిపారేయలేం. ఎందుకంటే అవతలి పక్షం ఎప్పుడు ఎలా వ్యవహరిస్తుందో తెలియని పరిస్థితి. అందుకే ఈ ప్రక్రియపై ఏ ప్రకటనైనా మేం జాగ్రత్తగా ఇవ్వాలి' అని ఇరాన్ విదేశాంగశాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి ట్రంప్ ప్రకటనకు ముందు తెలిపారు. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ఒప్పందానికి సంబంధించి కీలక వ్యాఖ్యలు చేశారు. లెబనాన్ సహా అన్ని ప్రాంతాల్లో యుద్ధం ముగించే ప్రాథమిక ఒప్పందంపై సంతకాలు చేయడానికి ఇరు పక్షాలు చర్చలు జరుపుతున్నాయని తెలిపారు. ఇందులో ఇరాన్ అణు కార్యక్రమం లేదని అన్నారు. ప్రాథమిక ఒప్పందం కుదిరిన 60 రోజుల తర్వాత అణ్వాయుధాల అంశంపై చర్చలు జరుగుతాయని తెలిపారు. తమ సుప్రీం నేత అలీ ఖమేనీ అంత్యక్రియల ఉరేగింపులు వచ్చే నెల 4న టెహ్రాన్‌లో ప్రారంభమవుతాయని ఇరాన్ ప్రకటించింది. తొమ్మిదో తేదీన అంత్యక్రియలు మషహద్ నగరంలో జరుగుతాయని పేర్కొంది. యుద్ధం ప్రారంభమైన తొలి రోజు (ఫిబ్రవరి 28) అమెరికా, ఇజ్రాయెల్ చేసిన సంయుక్త దాడుల్లో ఖమేనీ ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే.

**రూబియోకు నిరసన తెలిపా: జైశంకర్**

అమెరికా సైన్యం నిర్వహించిన దాడుల్లో ముగ్గురు భారతీయ నావికులు చనిపోయిన ఘటనపై తీవ్ర నిరసనను తాను అగ్ర రాజ్య విదేశాంగ మంత్రి మార్కో రూబియోకు తెలిపానని విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి ఎస్.జైశంకర్ శనివారం తెలిపారు. 'రూబియోతో మాట్లాడా. గల్ఫ్ ప్రాంతంలో యూఎస్ నౌకాదళం చేసిన దాడుల్లో ముగ్గురు భారతీయులు మృతి చెందడంపై ఇప్పటికే భారత్ వ్యక్తం చేసిన తీవ్ర ఆందోళనను పునరుద్ఘాటించా' అని ఐరోపా పర్యటనలో ఉన్న మంత్రి తెలిపారు. అయితే హర్మూజ్ జల సంధిపై తాము విధించిన దిగ్బంధనాన్ని ఉల్లంఘించడం తమకు ఆమోదయోగ్యం కాదని ఈ సందర్భంగా రూబియో చెప్పినట్లు అమెరికా విదేశాంగశాఖ తెలిపింది.

# మోడీ 12 ఏళ్ల పాలన దేశానికి గర్వకారణం: బీజేపీ




జయశంకర్ భూపాలపల్లి జిల్లా , ప్రజాస్పూర్తి : ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి ప్రపంచ వేదికపై ప్రత్యేక గుర్తింపు పొందిందని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిషిధర్ రెడ్డి అధ్యక్షతన శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మూగ జయశ్రీ, రాష్ట్ర అధికార ప్రతినిధి వన్నాల వెంకటరమణ పాల్గొని మోడీ ప్రభుత్వ 12 ఏళ్ల పాలన విజయాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మౌలిక సదుపాయాల అభివృద్ధి, పేదలకు ఇళ్ల నిర్మాణం, ఉచిత ఆహార ధాన్యాల పంపిణీ, రైతులకు ఆర్థిక సహాయం, తాగునీటి సదుపాయాల విస్తరణ వంటి కార్యక్రమాలతో కోట్లాది మంది ప్రజలు లబ్ధి పొందారని తెలిపారు. మేక్ ఇన్ ఇండియా, గ్రీన్ ఎనర్జీ, రక్షణ రంగ బలోపేతం, ఉగ్రవాదంపై కఠిన చర్యలు, రామ మందిర నిర్మాణం వంటి అంశాలు మోడీ ప్రభుత్వ కీలక విజయాలని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధికి కూడా కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, రాష్ట్రంలో బీజేపీకి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి సాధిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల స్థాయి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


# మల్లయ్య గూడెం కొత్తగుంట చెరువుకు గండి

* వృధాగా క్రిందికి పోతున్న చెరువు నీరు
* చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్



గరిడేపల్లి , ప్రజాస్పూర్తి : సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం రామచంద్రపురం గ్రామపంచాయతీ పరిధిలోని మల్లయ్య గూడెం చెరువుకి అలుగు గండికి దగ్గర పక్కనే పెద్ద గండిపడి నీరు మొత్తం వృధాగా క్రిందికి పోవడం జరుగుతుంది ఇది గత ఆరు నెలల నుండి ఇదే పరిస్థితి కొనసాగుతుందని స్థానిక రైతులు ప్రజలు తెలిపారు ఈ సందర్భంగా మీరు మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు అధికారులు ఇప్పటికైనా స్పందించి ప్రజల అవసరాల కోసం ఏర్పాటు చేసిన చెరువులో నీటిని క్రిందికి వృధాగా పోకుండా ఆ యొక్క గండిని పటిష్టంగా గట్టిగా మరమ్మత్తులు చేయించాలని నేడు వర్షాకాలం కారణంగా భారీ వర్షాలు వచ్చిరి వరదలు వచ్చినప్పుడు మరోసారి ఇలాంటి సంఘటనలు చోటు చేసుకో కోకుండా గెట్టి మరమ్మతులు చేయించాలని స్థానిక రైతులు ప్రజలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లయ్య గూడెం రైతులు గ్రామ ప్రజలు కర్షకులు కార్మికులు కాంగ్రెస్ పార్టీ మూడో వార్డు మెంబర్ బొలిశెట్టి శంకర్ ఐదో వార్డు మెంబర్ బొలిశెట్టి నరేష్, కుమార్, సిక్కుల రాములు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# రాయినిగూడెం గ్రామంలో నూతన గ్రామపంచాయతీ బిల్డింగ్ శంకుస్థాపన



గరిడేపల్లి, ప్రజాస్పూర్తి : తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా విలేజిలలో మౌలిక సదుపాయాలు ఉన్నాయని దృష్టిలో పెట్టుకొని మారుమూల గ్రామాలకు రోడ్లు అయితేనేమి ఎస్సీ కమ్యూనిటీ హాల్ అయితేనేమి గ్రంథాలయాలు అయితేనేమి గ్రామపంచాయతీ బిల్డింగులు అయితేనేమి అంగన్వాడిబిల్డింగులు అయితేనేమ విలేజి లల్లో ఏది ప్రాబ్లం ఉందని మంత్రి దృష్టికి తెలియగానేవెంటనే శాంక్షన్ చేసి మారుమూల గ్రామాలలో బిల్డింగులు శాంక్షన్ చేపిస్తున్న అపర భగీరథుడు మన మంత్రివర్యులు ఉత్తంకుమార్ రెడ్డి సహకారంతో రాయినిగూడెంలో గ్రామపంచాయతీ బిల్డింగ్ శంకుస్థాపన చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో పంచాయితీ రాజ్ ఏఈ కీత కళ్యాణ్ అలాగే పిఏసిఏ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ మాజీ ఎంపిటిసి బాల్దూరి సందీప్ మాజీ సర్పంచ్లు కడప దేవదానం దోసపాటి స్వరూపాభిక్షం గ్రామ శాఖ అధ్యక్షుడు గుండు శంభయ్య యూత్ అధ్యక్షుడు గుండు అశోక్ గ్రామపంచాయతీ వార్డు మెంబర్లు గుండు లక్ష్మమ్మ గురవయ్య అమరారపు తిమోతి రాజు గుండు ఉషారాణి పిడమర్తి ఈశ్వరమ్మ శ్రీనివాస్ రాచమల్ల శ్రీకాంత్ కాంపాటి రాజు మేకపోతుల రాంబాబు గుండు అంజయ్య బాలయ్య గుండు వెంకన్న గంట లింగయ్య , గ్రామపంచాయతీ సిబ్బంది గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# 18 నెలలపాటు నిఘా.. అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్టు

హైదరాబాద్: అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లింగ్ ముఠా సభ్యులను ఈగల్ ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. దాదాపు 200 కిలోల గంజాయిని సీజ్ చేశారు. 104 ప్యాకెట్లలో గంజాయి, ఏడు మొబైల్ ఫోన్లు, రూ.2,800 నగదు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.కోటి ఉంటుందని అంచనా. ఈ అంతర్రాష్ట్ర ముఠా కోసం ఈగల్ ఫోర్స్ పోలీసులు 18 నెలలపాటు నిఘా ఉంచారు. నిందితులు రెండు వాహనాల్లో గంజాయిని తరలిస్తుండగా.. ఖమ్మం జిల్లాలోని కొణిజర్ల సమీపంలో స్థానిక పోలీసుల సహకారంతో అడ్డగించారు. ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. గంజాయి సరఫరా కోసం ముందస్తుగా రూ.1.90 లక్షలు బ్యాంక్ ఖాతాల ద్వారా చెల్లించారని, సరకు అప్పగించాక ఇద్దరు ప్రధాన నిందితులకు రూ.8 లక్షలు ఇవ్వాలని ఒప్పందం కుదిరిందని గుర్తించారు. ఈ కేసులో ప్రధాన ఫైనాన్షియర్ ప్రభు, సప్లయర్ దేవి సింగ్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

# పరిశుభ్రమైన పరిసరాల కోసం పౌరుల భాగస్వామ్యం అత్యంత కీలకం

* కూకట్ పల్లి డీసీ ఆంజనేయులు

కూకట్ పల్లి, ప్రజాస్పూర్తి : పరిశుభ్రమైన పరిసరాల కోసం పౌరుల భాగస్వామ్యం అత్యంత కీలకమని కూకట్ పల్లి డీసీ ఆంజనేయులు అన్నారు. సైబరాబాద్ 99 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా కూకట్‌పల్లి జోన్ పరిధిలో గుర్తించిన పలు గార్బేజ్ వల్నరబుల్ పాయింట్లు ప్రజల భాగస్వామ్యం, సమన్వయం , పారిశుధ్య సిబ్బంది కృషితో విజయవంతంగా నిర్మూలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజల సహకారంతో పాటు పారిశుధ్య సిబ్బంది , రామ్‌కీ సంస్థ సిబ్బంది చురుకుగా



పాల్గొని పలు గార్బేజ్ వల్నరబుల్ పాయింట్లను లక్ష్యంగా తీసుకొని శుభ్రపరిచారు. అనంతరం ఆ ప్రదేశాలను పూలతో, రంగవల్లులతో అలంకరించి పరిశుభ్రమైన వాతావరణాన్ని సృష్టించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ల నిర్మూలనపై హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఈ ప్రాంతాల్లో చెత్త వేయకుండా పరిశుభ్రతను కాపాడేందుకు తమవంతు బాధ్యతగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం డీసీ ఆంజనేయులు మాట్లాడుతూ రోడ్లపై చెత్త వేయకుండా, పారిశుధ్య సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని సూచించారు. సమాజం, పారిశుధ్య సిబ్బంది , స్థానిక సంస్థల సమిష్టి కృషితో పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన నగర నిర్మాణం సాధ్యమవుతుందని అధికారులు తెలిపారు.

# ఉచిత కంటి శుక్లాల ఆపరేషన్లకు అవకాశం

జయశంకర్ భూపాలపల్లి జిల్లా , ప్రజాస్పూర్తి : కంటి పొరలు, శుక్లాల సమస్యతో బాధపడుతూ ఆపరేషన్ చేయించుకోవాలనుకునే వారికి జయశంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య సేవలు అందించనున్నారు. ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి ఆధ్వర్యంలో ఈ నెల 17న (బుధవారం) ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసి రోగులను కరీంనగర్‌లోని ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రికి తరలించి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భూపాలపల్లి పట్టణంలోని కిరణ్ ఆసుపత్రి ఎదుట ఉన్న తెలంగాణ సింగరేణి ఉద్యోగుల భవనం వద్దకు ఉదయం 9 గంటలకు బస్సు చేరుకోనుంది. ఆపరేషన్ చేయించుకోవాలనుకునే వారు ఉదయం 9 గంటలలోపు అక్కడికి చేరుకోవాలని సూచించారు. పేర్ల నమోదు కోసం 9440903023 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. ఇతర జిల్లాల నుంచి వచ్చే రోగులు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని, వారు ముందుగా ఫోన్ ద్వారా పేరు నమోదు చేసుకుని నేరుగా కరీంనగర్ ఆసుపత్రికి చేరుకోవచ్చని పేర్కొన్నారు. వెంట తీసుకురావాల్సినవి ఆధార్ కార్డు కలర్ జిరాక్స్ ప్రతులు - 3, పాస్‌పోర్ట్ సైజు కలర్ ఫోటోలు - 3, ఒక జత బట్టలు, ఒక దుప్పటి/చద్దర్, రోగితో పాటు వచ్చే వ్యక్తి కూడా ఒక చద్దర్ తీసుకురావాలి, తాగునీటి సీసా వెంట తీసుకురావాలి, అలాగే ఆపరేషన్ చేయించుకునే వారు కనీసం రెండు రోజుల ముందుగానే మద్యపానం పూర్తిగా మానివేయాలని వైద్యులు సూచించినట్లు నిర్వాహకులు తెలిపారు.

# ఉపాధి పనిలోనే షష్టిపూర్తి.. గుండెల్ని హత్తుకున్న వేడుక



రేగొండ, (ప్రజా స్పూర్తి): కోట్లు ఖర్చు చేసినా కొనలేని ఆనందం.. ఆత్మీయతలో, అనుబంధాల్లో దొరికే నిజమైన సంతోషం ఎలా ఉంటుందో రేగొండలో జరిగిన ఓ నిరాడంబర వేడుక చాటి చెప్పింది. ఖరీదైన ఫంక్షన్‌హాళ్లు, ఆర్భాటాల మధ్య జరుగుతున్న నేటి వేడుకలకు భిన్నంగా.. ఉపాధి హామీ పని ప్రదేశంలోనే ఓ వృద్ధ దంపతుల షష్టిపూర్తి వేడుక జరగడం అందరినీ ఆకట్టుకుంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రానికి చెందిన ఓ వృద్ధ దంపతులు దాంపత్య జీవితంలో 60 వసంతాలు పూర్తి చేసుకున్నారు. ఈ అరుదైన సందర్భాన్ని గుర్తించిన తోటి ఉపాధి హామీ కూలీలు వారికి మరపురాని కానుక అందించారు. రేగొండ గ్రామ శివారులో పనులు ముగిసిన అనంతరం పని ప్రదేశాన్నే వేడుక వేదికగా మార్చి షష్టిపూర్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. సాంప్రదాయ పద్ధతిలో వృద్ధ దంపతులకు దండలు మార్చించి మరోసారి పెళ్లి వేడుకను తలపించేలా కార్యక్రమం నిర్వహించారు. తోటి కూలీల చప్పట్లు, కేరింతల మధ్య వారు నవ వధూవరుల్లా చిరునవ్వులు చిందించారు. స్థానిక యువకులు చాక్లెట్లు పంచుతూ శుభాకాంక్షలు తెలియజేయగా, అక్కడి వాతావరణం ఆప్యాయతతో నిండిపోయింది. ఆడంబరాలకు తావులేకుండా, మనసుల్ని కలిపే ప్రేమాభిమానాలతో జరిగిన ఈ వేడుకను చూసిన వారంతా ప్రశంసిస్తున్నారు. డబ్బు కంటే మానవ సంబంధాలే గొప్పవని, ఆనందానికి ఆస్తులు కాదు ఆత్మీయతే అసలైన చిరునామా అని ఈ వృద్ధ దంపతుల షష్టిపూర్తి మరోసారి నిరూపించింది. ఈ వేడుకకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతుండగా, నెటిజన్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ''ఆడుతూ పాడుతూ పని చేస్తే అలసట ఉండదు.. అనుబంధాలే అసలైన సంపద'' అనే సందేశాన్ని ఈ సంఘటన నేటి తరానికి అందిస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# ప్రభుత్వ అనుమతి లేకుండా నడుపుతున్న 9 ఎడ్యుకేషన్ యాజమాన్యంపై వెంటనే చర్యలు తీసుకోవాలి

* ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఎండీ అన్వర్




మేడిపల్లి, ప్రజాస్పూర్తి : ప్రభుత్వ అనుమతి లేకుండా నడుపుతున్న 9 ఎడ్యుకేషన్ యాజమాన్యంపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఎండీ అన్వర్ అన్నారు. మేడ్చల్ జిల్లా, మేడిపల్లి మండలం, బోడుప్పల్ సర్కిల్ యందు ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా తగరగతులు నిర్వహిస్తున్న 9 ఎడ్యుకేషన్ కళాశాల ముందు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి అన్వర్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఇంటర్ కళాశాలలు ఎటువంటి ఇంటర్ బోర్డు అనుమతులు లేకున్నా, ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా, విద్యార్థులను చేర్చుకొని, వారి జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయన్నారు. 9 ఎడ్యుకేషన్ కళాశాలకు ఎటువంటి గుర్తింపు లేకున్నా విద్యార్థులను చేర్చుకొని, వారిని వారి తల్లితండ్రులను మోసం చేస్తున్నారన్నారు. ఇప్పటికే వారి నుండి అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేసి, అక్రమంగా తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో ఉండే అవకాశం ఉన్నదన్నారు. తక్షణమే ఇంటర్ విద్యాధికారులు ఈ కళాశాల తనిఖీ చేసి, యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకొని విద్యార్థుల భవిష్యత్తు కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కృష్ణ, సాయి కుమార్, శ్రీకాంత్, సాయి ఈశ్వర్, అభిషేక్, సిద్ధు, సాయి, తదితరులు పాల్గొన్నారు.


# ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టాలి

: జిల్లా విద్యార్థి సంఘాల జేఏసీ




జనగామ, ప్రజాస్పూర్తి : జిల్లా లోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యను వ్యాపారంగా మార్చాయని, ఈ దోపిడీని అరికట్టేందుకు ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యార్థి సంఘాల జేఏసీ (జాక్) డిమాండ్ చేసింది. జిల్లా కేంద్రంలో జేఏసీ కన్వీనర్ మంగళంపల్లి రాజు అధ్యక్షతన నిర్వహించిన పత్రికా సమావేశంలో విద్యార్థి నాయకులు మాట్లాడుతూ, అనేక ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై అధిక ఆర్థిక భారం మోపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంగళంపల్లి రాజు మాట్లాడుతూ, కార్పొరేట్ పాఠశాలల పేరుతో అధిక ట్యూషన్ ఫీజులు వసూలు చేయడమే కాకుండా పుస్తకాలు, యూనిఫాంలు, ఇతర విద్యా సామగ్రిని బలవంతంగా విక్రయిస్తూ తల్లిదండ్రులను ఆర్థికంగా దోచుకుంటున్నారని ఆరోపించారు. విద్యా సంస్థలపై సమగ్ర విచారణ చేపట్టి నిబంధనలు ఉల్లంఘిస్తున్న యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రత్యేక దృష్టి సారించి ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నిర్మాణాన్ని పరిశీలించాలని, జిల్లా స్థాయిలో ఫీజుల నియంత్రణ కమిటీని చురుకుగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తల్లిదండ్రుల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని సూచించారు. విద్య హక్కు కానీ వ్యాపారం కాదని, విద్యార్థులు, తల్లిదండ్రుల ప్రయోజనాల పరిరక్షణ కోసం విద్యార్థి సంఘాల జేఏసీ పోరాటాన్ని కొనసాగిస్తుందని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీజీవీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తుంగ కౌశిక్, వందేమాతరం స్టూడెంట్ ఫెడరేషన్ (వీఎస్ఎఫ్) జిల్లా అధ్యక్షుడు నల్లా రాహుల్‌తో పాటు వివిధ విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# బండారు రాజాను ఘనంగా సన్మానించిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు



ప్రజాస్పూర్తి, సూర్యాపేట: సూర్యాపేట పట్టణానికి చెందిన బండారు రాజా తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నియామకమయ్యారు. ఈ మేరకు హైదరాబాదులోని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా సూర్యాపేట లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బిఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా బండారు రాజా మాట్లాడుతూ జిల్లాలో ఆర్యవైశ్యుల అభివృద్ధి కొరకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సభ్యులుగా నియామకమైన సందర్భంగా బిఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వై వెంకటేశ్వర్లు , జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, నెమ్మది బిక్షం, తూడి నర్సింహా రావు, బెల్లంకొండ యాదగిరి గౌడ్, బడుగుల శ్రీనివాస్ యాదవ్, ఆకుల లవకుశ , బొమ్మగాని శ్రీనివాస్ గౌడ్, కాస శ్రీనివాస్ యాదవ్, ఆనంతుల ప్రకాష్, శ్రవణ్, కౌన్సిలర్ ఇందుశ్రీ, సారగండ్ల మాణిక్యమ్మ తో పాటు పలువురు అభినందనలు తెలిపారు.

# సింగరేణిని దోచుకున్నవారే ఇప్పుడు పరిరక్షకులా..?

* హరీష్‌రావు వ్యాఖ్యలు విడ్డూరం: ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, (ప్రజా స్పూర్తి): సింగరేణిని సర్వనాశనం చేసిన వారే ఇప్పుడు దాని పరిరక్షకులుగా మాట్లాడటం రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మండిపడ్డారు. నిజాన్ని అబద్ధంగా, అబద్ధాన్ని నిజంగా మార్చే సంస్కృతి కేసీఆర్ కుటుంబానికే అలవాటైందని తీవ్ర స్థాయిలో విమర్శించారు. శనివారం భూపాలపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణిని ఆదాయ వనరుగా కాకుండా దోపిడీ కేంద్రంగా మార్చిందని ఆరోపించారు. అందినకాడికి దోచుకుని ఇప్పుడు సింగరేణి కోసం ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు మాట్లాడటం ప్రజలను మోసం చేసే ప్రయత్నమేనన్నారు. భూపాలపల్లికి రావాల్సిన 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంటును రాజకీయ ప్రయోజనాల కోసం యాదాద్రికి తరలించారని ఆరోపించారు. ప్రాజెక్టు వ్యయాలను అమాంతం పెంచి వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని విమర్శించారు. నాసిరకం నిర్మాణాలు, అవినీతితో ప్లాంటును పనికిరాని స్థితికి చేర్చారని అన్నారు. సింగరేణి పరిధిలోని ప్రజల అభివృద్ధికి వినియోగించాల్సిన డీఎంఎఫ్టీ, సీఎస్ఆర్ నిధులను సిద్ధిపేట, హైదరాబాద్ ప్రాంతాలకు మళ్లించింది బీఆర్ఎస్ ప్రభుత్వమే కాదా అని ప్రశ్నించారు. గనుల ప్రభావంతో ఇబ్బందులు పడుతున్న భూపాలపల్లి ప్రజలకు న్యాయం చేయకుండా రాజకీయ అవసరాల కోసం నిధులను తరలించారని ఆరోపించారు. మాజీ మంత్రి హరీష్‌రావు భూపాలపల్లి పర్యటనలో సింగరేణిపై వ్యాఖ్యలు చేయడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ప్రజా సంక్షేమం, పారదర్శక పాలన కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, టౌన్ అధ్యక్షుడు దేవన్‌తో పాటు పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ని కలిసిన నాయకులు

* కృతజ్ఞతలు తెలిపిన మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బోయ దేవేందర్, మున్సిపల్ అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి



చౌటుప్పల్, ప్రజాస్పూర్తి : మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్యతో కలిసి చౌటుప్పల్ మండల కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నికైన బోయ దేవేందర్, చౌటుప్పల్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నికైన కాసర్ల శ్రీనివాస్ రెడ్డిలు హైదరాబాదులోని నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా బోయ దేవేందర్, కాసర్ల శ్రీనివాస్ రెడ్డిలు మాట్లాడుతూ తమకు అవకాశం కల్పించిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి కంకణ బద్ధులమై పనిచేస్తామన్నారు. పార్టీ అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తామన్నారు.

# ప్రజాస్వామ్యంలో ఓటు అనేది అత్యంత విలువైన హక్కు

*** మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : ప్రజాస్వామ్యంలో ఓటు అనేది అత్యంత విలువైన హక్కు అని, ఆ హక్కును కాపాడుకోవడం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యత అని రాష్ట్ర రోడ్లు, భవనాలు , సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. నల్లగొండ పట్టణంలోని ఎంఎన్ ఆర్ గార్డెన్స్‌లో కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్స్ (బీఎల్ఏలు) కోసం నిర్వహించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్,) అవగాహన కార్యక్రమంలో రాష్ట్ర రోడ్లు, భవనాలు , సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా నడుస్తుందన్నారు. రాహుల్ గాంధీని ప్రదాని చేసుకోవడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. దేశవ్యాప్తంగా ప్రతి పౌరుడి ఓటు హక్కు పరిరక్షణ కోసం పోరాడుతున్నారని, అదే స్ఫూర్తితో బూత్ స్థాయిలో ప్రతి కార్యకర్త అప్రమత్తంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.బీజేపీ ఓటు చోరీ మాత్రమే కాదు, సీటు చోరీ కూడా చేస్తోంది అన్నారు. ఓటర్ల జాబితాలో జరిగే లోపాలు, అక్రమాలు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే ప్రమాదం ఉందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు విలువైనదని, ఓటర్ల జాబితాలో జరిగే చిన్న పొరపాటు కూడా ఎన్నికల ఫలితాలను మార్చగలదని పేర్కొన్నారు. ప్రతి బీఎల్ఏ తన బూత్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రజల ఆశీర్వాదం కాంగ్రెస్ పార్టీకి ఉందని, అయితే ఆ మద్దతు ఓటుగా మారి ఓటర్ల జాబితాలో సురక్షితంగా ఉండేలా చూడటం ప్రతి కార్యకర్త బాధ్యత అని మంత్రి పేర్కొన్నారు. బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కృషి చేయాలన్నారు.ఈ శిబిరానికి ముఖ్యఅతిథిగా టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ ఎస్ఐఆర్ చైర్మన్ పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి రామ్మోహన్ రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ సర్ పరిశీలకులు రామ్, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, నియోజకవర్గ సర్ పరిశీలకులు రామ్ జి, మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ అహ్మద్ అష్రఫ్ అలీ అమేర్, నల్లగొండ పట్టణ అధ్యక్షులు గుమ్ముల మోహన్ రెడ్డి,మాజీ మున్సిపల్ ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి మార్కెట్ చైర్మన్ జూకూరి రమేష్, కనగల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గడ్డం అనప రెడ్డి, మాజీ జెడ్పిటిసి వంగూరు లక్ష్మయ్య,బూత్ లెవెల్ ఏజెంట్స్,కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మహముత్తారం పోలీస్ స్టేషన్‌పై అడిషనల్ ఎస్పీ ఆకస్మిక తనిఖీ




జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : భూపాలపల్లి జిల్లా అడిషనల్ ఎస్పీ నరేష్‌కుమార్ శనివారం మహముత్తారం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో నిర్వహిస్తున్న రికార్డులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, సీసీ కెమెరాల పనితీరు, స్టేషన్ పరిశుభ్రత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా పోలీసు సిబ్బందితో సమావేశమైన అడిషనల్ ఎస్పీ, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే పరిష్కరించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.నేరాల నియంత్రణలో అప్రమత్తంగా వ్యవహరించాలని, గ్రామీణ ప్రాంతాల్లో నిఘాను మరింత పటిష్ఠం చేయాలని సూచించారు. స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, పారదర్శకమైన పోలీసు సేవలు అందించాలని పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా ప్రతి పోలీసు అధికారి బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని అడిషనల్ ఎస్పీ నరేష్‌కుమార్ స్పష్టం చేశారు.

## మహిళా ఉద్యోగుల ఫోటోలు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్టులు

*** కలెక్టర్ ఆదేశాలతో వేగంగా చర్యలు.**

జనగామ, ప్రజాస్ఫూర్తి : మహిళా ఉద్యో గుల ఫోటోలను అనుమతి లేకుండా సేకరించి, మార్ఫింగ్ చేసి సోషల్ మీడి యా లో అసభ్యకరంగా పోస్టు చేసిన ఆరోపణల పై జిల్లా వ్యవసాయ శాఖకు చెందిన వ్యవసాయ అధికారి విజయ్ రెడ్డి ని పోలీసులు అరెస్ట్ చేశారు. పోష్ చట్టం-2013తో పాటు భారతీయ న్యా య సంహిత (బీఎన్ఎస్), ఐటీ చట్టం లోని పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు సమాచారం.వ్యవసాయ శాఖ లో పనిచేస్తున్న ఓ మహిళా ఉద్యోగి ఫి ర్యాదు మేరకు ఈ విషయం జిల్లా కలెక్ట ర్ సందీప్ కుమార్ ఝా దృష్టికి వెళ్లింది. కలెక్టర్ ఆదేశాల మేరకు సైబర్ క్రైమ్,ఐ టీ మానిటరింగ్ సెల్, పోలీసు శాఖలు సంయుక్తంగా విచారణ చేపట్టాయి. ద ర్యాప్తులో పలువురు మహిళా అధికా రులు, ఉద్యోగులు కూడా బాధితులు గా ఉన్నట్లు గుర్తించారు. అంతర్గత ఫి ర్యాదుల కమిటీ (ఐసీసీ) ప్రాథమికంగా ఆరోపణలను నిర్ధారించడంతో అధికారి కంగా పోలీసులకు ఫిర్యాదు అందజేశా రు. దీంతో పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్లు 75, 77, 78, 79, 296(బి)తో పాటు ఐ టీ చట్టం లోని 66 ఈ, 67 ఏ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.మహి ళా ఉద్యోగుల భద్రత విషయంలో రాజీ పడకుండా వేగంగా స్పందించి చర్యలు తీసుకున్న జిల్లా కలెక్టర్ సందీప్ కుమా ర్ ఝాకు బాధితులు కృతజ్ఞతలు తెలి పారు. నిందితుడికి కఠిన శిక్ష విధించాలని వారు కోరుతున్నారు.

## కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షునికి ఘన సన్మానం



వలిగొండ, ప్రజాస్ఫూర్తి : వలిగొండ మండల కాంగ్రెస్ పార్టి నూతన అధ్యక్షునిగా ఇటీవల నియమితులైన బత్తిని సహదేవ్ గౌడ్ ను ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు మారగోని శ్రీనివాస్ గౌడ్ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. సన్మాన కార్యక్రమానికి ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు కమిటీని వేయడం పట్ల కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే ఉద్యమకారుల ఫోరం నాయకుడు బత్తిని సహదేవ గౌడ్ ను అధ్యక్షునిగా నియమించడం పట్ల ఆయన వర్షం వ్యక్తం చేశారు. అనంతరం నూతన అధ్యక్షుడు సహదేవ్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీని మాట తప్పకుండా నెరవేరుస్తుందని, తనను సన్మానించిన ఉద్యమకారుల ఫోరం నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగు అంజయ్య, ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షుడు శీలం స్వామి, ఫోరం గౌరవ అధ్యక్షుడుకళ్లెం లక్ష్మారెడ్డి, జిల్లా అధ్యక్షుడు గంధ మల్ల బాలయ్య, ఉమ్మడి జిల్లా మహిళా అధ్యక్షురాలు గంధ మల్ల మల్లమ్మ, చిలుగూరిసత్తిరెడ్డి, బత్తిని రవీందర్, మల్లం వెంకటేశం,బొడిగేసుదర్శన్, కదిరేని స్వామి,కొండూరు సత్తయ్య,దండ మల్లికార్జున్, సుంకి వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**- చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ సూచించారు. శనివారం మధ్యాహ్నం మున్సిపల్ వ్యాప్తంగా భారీ ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షం తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఫోటో మున్సిపల్ చైర్ పర్సన్ మోగుదాల పావని రమేష్‌గౌడ్ ప్రజలకు పలు సూచనలు చేశారు. మున్సిపల్ వ్యాప్తంగా విద్యుత్ స్తంభాలు, చెట్లు, అకాల వర్షానికి కూలిపోయే ప్రమాదం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అకాల వర్షానికి వార్డుల్లో విద్యుత్ స్తంభాలు, చెట్లు కూలిపోయినచో భయాందోళనకు గురి కావద్దని, సంబంధిత కౌన్సిలర్, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, మున్సిపల్ కమిషనర్ కు తెలియపరచగలరని, అందరు అందుబాటులోనే ఉంటామని పేర్కొన్నారు. తప్పనిసరి అయితే తప్ప ఎవరూ ఇళ్ల నుంచి బయటకు వెళ్లొద్దని సూచించారు. అన్ని శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.


## నల్లగొండ జిల్లాలో బత్తాయి సాగులో దేశానికే ఆదర్శంగా నిలుపుతాయి

*** మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : రైతుల ఐక్యత, పరస్పర సహకారం, ప్రభుత్వ మద్దతుతో నల్గొండ జిల్లాను బత్తాయి సాగులో దేశానికే ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.శనివారం నల్గొండ జిల్లా కేంద్రంలోని ఎలిమినేటి మాధవరెడ్డి ఆ డి టో రి యం లో నిర్వ హిం చి న రాష్ట్రస్థాయి సిట్రస్ సెమినార్ కు ముఖ్యఅతిథిగా హాజరైన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికై అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నదని అన్నారు. నల్గొండ పేరు వినగానే బత్తాయి గుర్తుకొస్తుందని, జిల్లాలో గతంలో 4 లక్షల ఎకరాల బత్తాయి సాగు కాగా, కాలక్రమేనా వివిధ కారణాలవల్ల అది 40 వేల ఎకరాలకు తగ్గడం బాధాకరమన్నారు. అయితే మారుతున్న పరిస్థితులకు అనుకూలంగా రైతులు కూడా మారాల్సిన అవసరం ఉందని, ఎప్పుడు వరిపైనే ఆధారపడకుండా బత్తాయి లాంటి పంటలు, ఇతర ఉద్యాన పంటలను సాగు చేయాలన్నారు. పంట మార్పిడిపై తప్పనిసరి దృష్టి సారించాలని ,ఈ విషయంలో రైతులకు ప్రభుత్వ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వివిధ పంటలు సాగుచేసే రైతులకు సహకారం అందిస్తున్నదని, ముఖ్యంగా వరి పండించిన రైతులకు మద్దతు ధర కల్పించడమే కాకుండా, 500 రూపాయల బోనస్ ఇచ్చి సన్నధాన్యాన్ని కొనుగోలు చేస్తుదన్నారు. రైతులు పంట మార్పిడితోపాటు, ఉద్యాన పంటలను సాగు చేయాలని, నల్గొండ జిల్లాలో బత్తాయి సాగుకు పూర్వవైభవాన్ని తీసుకువచ్చేందుకు కృషిచేస్తామన్నారు. .కార్యక్రమానికి హాజరైన పరిగి శాసనసభ్యులు రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ బత్తాయిలో అనేక కొత్త రకం వంగడాలు వచ్చాయని, రైతులకు ఇవి ప్రయోజనకరంగా ఉంటాయని, ముందు నుండి నల్గొండ బత్తాయికి ఎంతో పేరు ప్రఖ్యాతలు పొందిందని, రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రైతు భరోసా, రైతు బీమా, మహిళలకు రుణాలు తదితర సౌకర్యాలను కల్పిస్తున్నదన్నారు. అనంతరం రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, నల్గొండ మున్సిపల్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర డైరీ డెవలప్మెంట్ చైర్మన్ అమిత్ రెడ్డి, తదితరులు మాట్లాడారు .ఈ కార్యక్రమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డి. రాజి రెడ్డి, రైతు కమిషన్ సభ్యులు రామ్ రెడ్డి, చెవిటి వెంకన్న, పావని రెడ్డి, ఉద్యాన శాఖ రాష్ట్రస్థాయి అధికారులు, జిల్లాల అధికారులు, అభ్యుదయ రైతులు, బత్తాయి రైతులు, తదితరులు పాల్గొన్నారు . ఈ సందర్భంగా ఆడిటోరియం ఆవరణలో ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాళ్లను మంత్రి ప్రారంభించారు.

### ఘనంగా మాజీ రాజ్యసభ సభ్యుడు
## బడుగుల లింగయ్య యాదవ్ జన్మదిన వేడుకలు



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి: మాజీ రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్ జన్మదిన వేడుకలను గరిడేపల్లి మండల కేంద్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు. హుజూర్‌నగర్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కడియం వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కడియం వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, బడుగుల లింగయ్య యాదవ్ సామాజిక న్యాయం, బీసీ వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేసిన నాయకుడని కొనియాడారు. ప్రజల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేసిన ఆయన సేవలు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు ఇప్పటికీ గుర్తుంచుకుంటున్నారని అన్నారు. రానున్న రోజుల్లో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర రాజకీయాల్లో మార్పులు చోటుచేసుకుంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు బడుగుల లింగయ్య యాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన ఆయురారోగ్యాలతో మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. అనంతరం కేక్‌ను పంపిణీ చేసి వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గరిడేపల్లి మాజీ టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ప్రధాని సైదులు, మాజీ ఎంపీటీసీ కడియం స్వప్న, పెండెం ధనయ్య హుజూర్‌నగర్ నియోజకవర్గ నాయకులు పెండెం వెంకట రాములు, షేక్ రాజమహమ్మద్, బండ్ల గోపాల్, మామిడి కాశి అంజయ్య, పెండెం వినోద్, పెండెం శంకర్, పెండెం శ్రీను, రెబ్బ శివ, ఆదం, పిట్ట నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## పేటలో ఘనంగా బడుగుల లింగయ్య యాదవ్ జన్మదిన వేడుకలు..



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: మాజీ రాజ్యసభ సభ్యులు, బిఆర్ఎస్ పార్టీ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్య యాదవ్ జన్మదిన వేడుకలు సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఉదయం ప్రయాణికులకు, వీధి వ్యాపారులకు, కూలీలకు అల్పాహారం పంపిణీ చేసి అనంతరం వారి నివాసంలో పెద్ద ఎత్తున బిఆర్ఎస్ శ్రేణులు, అభిమానుల నడుమ భారీ కేక్ కట్ చేశారు. అనంతరం ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేసి స్థానిక కొత్త బస్టాండ్ ఫ్లైఓవర్ వద్ద అన్నదాన నిర్వహించారు. పలుచోట్ల జరిగిన ఆయా కార్యక్రమాలలో ప్రజా ప్రతినిధులు, ఆయా సంఘాల నాయకులు, బిఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమం లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, మాజి గ్రంధాలయ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, మాజి మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, పట్టణ అధ్యక్షులు సవరాల సత్యనారాయణ, నెమ్మది భిక్షం, ఆకుల లవకుశ, బండారు రాజా, బడుగుల యశ్వంత్, బడుగుల శ్రీనివాస్, బెల్లంకొండ యాదగిరి, బొమ్మగాని శ్రీనివాస్, రేణు బాబు, డిల్లీ పావని ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు

## గోవర్ధనగిరి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం.. ఇద్దరు మృతి



రఘునాథపల్లి/జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా లోని రఘునాథపల్లి మండల పరి ధి లోని గోవర్ధనగిరి గ్రామం వద్ద శనివా రం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెంద గా, నలుగురు గాయపడ్డారు.పోలీసుల వివరాల ప్రకారం, హైదరాబాద్ నుంచి హనుమకొండ వైపు వెళ్తున్న ఎర్టిగా కారు (టీజీ 24బి 9237) అతి వేగంగా ప్రయాణిస్తుండగా డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో రోడ్డు పై నుంచి పక్కకు దిగి కాలువలో పడిపోయింది.ఈ ప్రమా దం తెల్లవారుజామున సుమారు 2:30 గంటల సమయంలో గోవర్ధనగిరి లోని దర్గా ఎదురుగా చోటుచేసుకుంది. కారు లో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగు రు ప్రయాణిస్తుండగా,ప్రమాదంలో ఎం డి.అసద్ (26),అఫ్సా హబీబ్ (27)లు అక్కడికక్కడే మృతి చెందారు. మరో నలుగురు రహముద్దీన్ ఖాన్ (డ్రైవర్), షాహీన్ బేగం, ఇలేషా,రేష్మాలకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందు కున్న పోలీసులు వెంటనే డీసీపీ పర్యవే క్షణ లో ఘటనాస్థలికి చేరుకుని సహా యక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం జనగామ ప్రభు త్వ ఆసుపత్రికి తరలించగా,మృతదేహా లను పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి త రలించారు .ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై నరేష్ యాదవ్ తెలిపారు. ఈ విషాద ఘటన తో మృతుల కుటుంబ సభ్యులు,బంధువులు తీవ్ర శోకసంద్రంలో మునిగిపో యారు. రోడ్డు ప్రమాదానికి అధిక వేగ మే ప్రధాన కారణంగా భావిస్తున్న పోలీ సులు అన్ని క ణాల్లో విచారణ కొనసా గిస్తున్నట్లు తెలిపారు.

## ఉప సర్పంచుల ఫోరం మండల కమిటీ ఎన్నిక

**- మండల అధ్యక్షునిగా బొమ్మకంటి కిశోర్ కుమార్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ఉప సర్పంచుల ఫోరం యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు సుర్కంటి శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామం రిక్కల సత్తిరెడ్డి గార్డెన్స్ లో శనివారం మండల ఉప సర్పంచుల ఫోరం సమావేశం నిర్వహించారు. ఉప సర్పంచుల ఫోరం చౌటుప్పల్ మండల కమిటీని ఎన్నుకున్నారు. ఉప సర్పంచుల ఫోరం చౌటుప్పల్ మండల అధ్యక్షునిగా చింతలగూడెం ఉపసర్పంచ్ బొమ్మకంటి కిషోర్ కుమార్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షునిగా మీసాల నరసింహ, ఉపాధ్యక్షులుగా జెల్ల పవన్ కుమార్, బాతరాజు ధనుంజయ్, పల్చం జయమ్మ, ప్రధాన కార్యదర్శిగా బోయ సదానందం, కార్యదర్శిగా శ్యామల చిరంజీవి, కార్యనిర్వహణ అధ్యక్షునిగా కందగట్ల సురేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శులుగా నిమ్మల సత్యనారాయణ, ముద్దం రమేష్ యాదవ్, కోశాధికారిగా వలందాసు మహేష్ గౌడ్, గౌరవ సలహాదారులుగా పినింటి శ్రీనివాసరెడ్డి, ఉప్పునూతల నరసింహ, సుర్కంటి ప్రభాకర్ రెడ్డి, ఫకీరు శ్రీనివాస్ రెడ్డి, కమిటీ సభ్యులుగా బోయిని లింగస్వామి యాదవ్, గడ్డం సత్తయ్య, పెరుమాండ్ల లింగస్వామి, బకనగారి శ్రవణ్ కుమార్, సామిడి శ్రీనివాస్ రెడ్డి, సుర్కంటి అనూప్ రెడ్డి, డి రాజులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన మండల కమిటీని పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు అభినందించారు. నూతన అధ్యక్షుడు బొమ్మకంటి కిషోర్ కుమార్ ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన ఉప సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు బొమ్మకంటి కిషోర్ కుమార్ మాట్లాడుతూ ఉప సర్పంచులందరినీ కలుపుకొని మండలంలోని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఉప సర్పంచుల హక్కుల పరిరక్షణ కోసం సమర్థవంతంగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఏకగ్రీవంగా తనను మండల అధ్యక్షునిగా ఎన్నుకోవడం పట్ల ఉపసర్పంచ్ లకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

# నిమ్స్లో బాలుకు ఘన సన్మానం



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రి కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కొత్తగూడెంకు చెందిన యంగ్ ఇండియన్ బ్లడ్ డోనార్స్ క్లబ్ జాతీయ అధ్యక్షులు జేబీ బాలును ఘనంగా సత్కరించారు. రక్తదాన కార్యక్రమాల ద్వారా సమాజానికి విశేష సేవలందిస్తున్న జేబీ బాలు సేవలను గుర్తిస్తూ నిర్వాహకులు శాలువా కప్పి, మెమొంటో అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు, సామాజిక సేవకులు మాట్లాడుతూ రక్తదాన ఉద్యమ విస్తరణకు బాలు చేస్తున్న కృషిని అభినందించారు. అనంతరం బాలు మాట్లాడుతూ ఇంటికో రక్తదాతను సృష్టించడమే లక్ష్యంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రక్తదాతలుగా మారడమే కాకుండా, మరో ముగ్గురిని కూడా రక్తదానానికి ప్రోత్సహించాలని కోరారు. రక్తదానం ద్వారా అనేక మంది ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని, యువత పెద్ద ఎత్తున స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ రంగాల ప్రముఖులు, రక్తదాతలు పాల్గొన్నారు.

# మున్సిపల్ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

* **చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ సూచించారు. శనివారం మధ్యాహ్నం చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో ప్రజలకు పలు జాగ్రత్తలు సూచించారు. మున్సిపాలిటీ వ్యాప్తంగా విద్యుత్ స్తంభాలు, చెట్లు కూలిపోయే ప్రమాదం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె తెలిపారు. వర్షాల కారణంగా ఎక్కడైనా విద్యుత్ స్తంభాలు లేదా చెట్లు కూలిపోయినట్లయితే భయాందోళనలకు గురికాకుండా వెంటనే సంబంధిత వార్డు కౌన్సిలర్, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది లేదా మున్సిపల్ కమిషనర్‌కు సమాచారం అందించాలని కోరారు. అత్యవసర పరిస్థితులు మినహా ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని సూచించారు. వర్షాల కారణంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా అధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటారని చెప్పారు. అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ఆదేశించినట్లు తెలిపారు. ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యమని, వర్షాల సమయంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా జాగ్రత్తలు పాటించాలని విజ్ఞప్తి చేశారు.

# సైబర్ క్రైమ్ పై ఎస్బిఐ అవగాహన కార్యక్రమం

నల్గొండ, ప్రజాస్ఫూర్తి : పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రీజినల్ బిజినెస్ ఆఫీస్ (ఆర్బీఓ) నల్గొండ ఆధ్వర్యంలో శనివారం భారీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రీజినల్ మేనేజర్ పి. పద్మ బాబు గౌడ్ నాయకత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. నల్గొండలోని ఎన్.జి. కళాశాల, మేకల అభినవ్ స్టేడియంతో పాటు దేవరకొండ, మిర్యాలగూడ పట్టణాల్లో ప్రజలు వాకింగ్ కోసం వినియోగించే ప్రభుత్వ కళాశాల మైదానాల్లో ఏకకాలంలో కార్యక్రమాలు నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమంలో 18 శాఖల నుంచి సుమారు 7080 మంది సిబ్బంది, బ్రాంచ్ హెడ్స్, ఆర్బీఓ సిబ్బంది, మేనేజర్ (హెచ్ఆర్), చీఫ్ మేనేజర్ (ఆపరేషన్స్) పాల్గొన్నారు. ప్రతి కేంద్రంలోనూ వినియోగదారుల నుంచి విశేష స్పందన లభించింది. సైబర్ మోసాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఓటీపీ, పిన్, పాస్‌వర్డ్‌లను ఎవరితోనూ పంచుకోవద్దని అధికారులు వివరించారు. అదేవిధంగా బ్యాంక్ వెబ్‌సైట్, వాట్సాప్ బ్యాంకింగ్, యోనో యాప్ ద్వారా కొనసాగుతున్న రీకేవైసీ డ్రైవ్ గురించి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పలువురు వినియోగదారులు తమ కేవైసీ వివరాలను అప్‌డేట్ చేసుకున్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద లింక్‌లను క్లిక్ చేయవద్దని ఆర్ఎం పద్మ బాబు గౌడ్, జి వెంకటేశ్వరరావు సీఎం, క్షితిజి సీఎం ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# వీధి వ్యాపారులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లను కల్పించాలి

* **బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్**



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : వీధి వ్యాపారులకు ప్రత్యామ్నాయ స్థలాలను, ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేయాలని బిఆర్ఎస్ ఎల్పి విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అధికారులను ఆదేశించారు. శనివారం జగద్గిరిగుట్ట డివిజన్ రాజీవ్ గృహకల్ప సముదాయంలో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అధికారులతో పర్యటించిన అనంతరం వార్డ్ కార్యాలయంలొ నిర్వహించిన సమావేశంలో .భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక చిన్నపాటి వర్షానికే వరద నీరు ఇళ్లలోకి చేరుతుందని, అర్ధరాత్రి వేళలో లో ప్రెజర్ తో త్రాగునీటిని సరఫరా చేయడం వల్ల త్రాగడానికి నీళ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని, అదేవిధంగా తమ జీవనోపాధి కోసం డబ్బాలను ఏర్పాటు చేసుకొని చిన్నచిన్న వ్యాపారాలు నిర్వహించుకుంటే అధికారులు డబ్బాలను తొలగించాలంటూ వేధింపులకు గురి చేస్తున్నారన్నారని రాజీవ్ గృహకల్ప వాసులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ మాట్లాడుతూ రాజీవ్ గృహకల్ప సముదాయంలో ఉండేది అధికంగా పేదలేనని, జీవనోపాధి కోసం కూలి పనికోసం, ఉద్యోగాలకు కోసం నగరానికి వెళ్లి వచ్చే ప్రైవేటు ఉద్యోగులు అర్ధరాత్రి వేళల్లో లో ప్రెజర్ తో నీటిని సరఫరా చేయడం ద్వారా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తాగునీటి సరఫరా వేళల్లో మార్పులు చేసి అర్ధరాత్రి వేళల్లో కాకుండా సాయంత్రం వేళల్లో నీటిని విడుదల చేయాలని అన్నారు. అదేవిధంగా భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు, మాజీ కార్పొరేటర్ జగన్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, రాజీవ్ గృహకల్ప సముదాయం సంక్షేమ సంఘాల సభ్యులు, గృహకల్ప వాసులు, స్థానిక నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# మేము ఎవరి భూమిని కబ్జా చేయలేదు

* **తప్పుదోవ పట్టించిన వారిపై చర్యలు తీసుకోవాలి**

ప్రజాస్ఫూర్తి , జన్నారం : జన్నారం శివారులో ఉన్న సర్వే నెంబర్ 79 లో గల 35 గుంటల భూమిని పెంద్రం సురేష్ అనే వ్యక్తి వద్ద కొనుగోలు చేశామని, మేము ఎవరు భూమిని కబ్జా చేయలేదని పట్టదారులు ధ్యావరశెట్టి శ్రీధర్,ఉత్తూరి ప్రభాకర్ లు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో శనివారం రోజున ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జన్నారం శివారులో ఉన్న సర్వే నెంబర్ 79లో గల 35 గుంటల భూమిని పెంద్రం సురేష్ అనే వ్యక్తి వద్ద 2021 లో కొనుగోలు చేశామని, కొనుగోలు చేసి ఇప్పటికే ఐదు సంవత్సరాలు గడిచింది.



మా అవసర నిమిత్తం ఇట్టి భూమిని అమ్మే సమయంలో సోయం లక్ష్మణ్, సోయం పారుబాయి లు భూమికి సంబంధించిన ఎలాంటి కాగితాలు లేకుండా ఆ భూమి మాది అని పాషా, ప్రసాద్, వాజిద్, పెంద్రం రాజేశ్వర్,కొత్నాక మనోజ్, కోవ విజయ్ ల ప్రోద్బలంతో మమ్మల్ని ఇబ్బందులకు గురి చేయడమే కాకుండా మా స్థలంలో జెండాలు పాదారు అంతేకాకుండా అనవసరమైన ర్యాలీ నిర్వహించి మా పరువు ప్రతిష్టకు భంగం కలిగించి, భూమి అమ్ముడుపోకుండా మమ్మల్ని ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. సర్వే నెంబర్ 79లో ఉన్న 35 గుంటల భూమిని న్యాయనిపుణుల సలహాతో సర్వేనెంబర్ 80 లో పట్టా బదులు చేసుకొని భూమిని పొజిషన్లో సరి చేసుకున్నాము. అంతేతప్ప మేము ఆదివాసీల భూమిని ఆక్రమించుకోలేదని, మా భూమిలో పాతిన జండాలను తొలగించి, ఈనెల 10వ తేదీన ర్యాలీకి ప్రోత్సహించిన వ్యక్తులపై చట్టరీ చర్యలు తీసుకొని మాకు న్యాయం చేయాలని పట్టాదారులు ధ్యావరశెట్టి శ్రీధర్,ఉత్తూరి ప్రభాకర్ లు కోరారు.

# మొక్కలు నాటండి.. చెట్లను నరకవద్దు !

* **చెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకోండి: ప్రకృతి ప్రేమికులు**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: పర్యావరణ పరిరక్షణ కోసం ఒకవైపు ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రకృతి ప్రేమికులు పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాలు చేపడుతుండగా, మరోవైపు ఇప్పటికే పెరిగి భారీ వృక్షాలుగా మారిన చెట్లు గొడ్డలి వేటుకు బలవుతున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో హైటెన్షన్ విద్యుత్ లైన్ల ఏర్పాటు పేరుతో పచ్చని వృక్షాలను నరుకుతుండటంపై ప్రకృతి ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.రామవరం మాతాశిశు ఆరోగ్య కేంద్రం రహదారి వెంట గతంలో నాటిన మొక్కలు ప్రస్తుతం భారీ వృక్షాలుగా ఎదిగాయి. అయితే హైటెన్షన్ విద్యుత్ లైన్ ఏర్పాటు సందర్భంగా ఎటువంటి అనుమతులు లేకుండా చెట్లను నరికి వేయడం బాధాకరమని సీపీఐ ఫ్లోర్ లీడర్ కంచర్ల జమలయ్య విమర్శించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్ అనుమతి లేకుండానే చెట్లను తొలగించడం సరికాదని ఆయన అన్నారు. చెట్ల నరికివేతకు బాధ్యులైన కాంట్రాక్టర్, అధికారులపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**చిన్నారి నైనిక రజ్వా ఆవేదన**

"మొక్కలను నాటండి.. చెట్లను నరకకండి" అనే సందేశంతో చిన్నారి నైనిక రజ్వా అందరినీ ఆకట్టుకుంది. పర్యావరణ పరిరక్షణపై చిన్న వయసులోనే అవగాహన కలిగి ఉన్న ఆమె, చెట్ల నరికివేత విషయం తెలుసుకుని సంఘటన స్థలానికి చేరుకుని చేతులు జోడించి వేడుకుంది."మొక్కలు లేకపోతే భవిష్యత్తులో మరిన్ని ప్రకృతి విపత్తులను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఎక్కడో ఆకాశంలో ఉన్న విద్యుత్ లైన్ల కోసం భూమిపై మనకు ప్రాణవాయువునిచ్చే చెట్లను నరికివేయడం సరికాదు. ఈ వేసవిలో అధిక ఉష్ణోగ్రతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అందుకే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి.. చెట్లను కాపాడాలి" అని నైనిక రజ్వా కోరింది.ప్రకృతి ప్రేమికులు చెబుతున్నట్లుగా, ఒక చెట్టును నరికితే దానికి బదులుగా కనీసం రెట్టింపు మొక్కలను నాటే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. పచ్చదనం పరిరక్షణ ద్వారానే భావితరాలకు సురక్షితమైన భవిష్యత్తు అందించగలమని వారు సూచిస్తున్నారు.

# ప్రమాదకరంగా మారిన 11 కెవి విద్యుత్ లైన్ ప్రమాదంలో ప్రజలు



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు బేతోలు గ్రామంలో బీసీ కాలనీలో ఇండ్లపై నుంచి వెళ్లిన 11 కెవి విద్యుత్ లైన్ కారణంగా ప్రాణాపాయం నెలకొన్నదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు.బీసీ కాలనీలో పలు ఇళ్లపైగా 11 కెవి హైటెన్షన్ లైన్ వెళ్లడం వల్ల ఎప్పటికప్పుడు ప్రమాదాలు సంభవించే పరిస్థితి ఏర్పడిందన్నారు. పిల్లలు, వృద్ధులు భయాందోళనలకు గురవుతున్నారని తెలిపారు.ముఖ్యంగా వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో విద్యుత్ ప్రమాదాల ముప్పు మరింత పెరిగిందని బిసి కాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై ఇప్పటికే పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని బిసి కాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగే వరకు అధికారులు స్పందిస్తారా అని ప్రశ్నిస్తున్నారు. ఏ క్షణంలోనైనా ప్రాణనష్టం జరిగే అవకాశం ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం మంచిదని సూచిస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ ఉన్నతఅధికారులు స్పందించి. క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని 6వ వార్డు బీసీ కాలనీ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో షేక్ ఖాదర్ బాబా, బీసీ కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్ ఆధ్వర్యంలో ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ

* **జులై 1 నుండి శిక్షణ ప్రారంభం**



నల్గొండ, ప్రజాస్ఫూర్తి : తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో బ్రైడ్ ఇన్స్టిట్యూట్ రాజేంద్రనగర్ ఆధ్వర్యంలో ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ డి.నాగరాజ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ శిక్షణ కార్యక్రమంలో ఏసీ రిపేరింగ్, హౌస్ వైరింగ్, సీసీటీవీ ల రిపేర్ కోర్సుల్లో శిక్షణ అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. జూలై 1వ తేదీ నుండి శిక్షణ కార్యక్రమం ప్రారంభం కానుందని తెలిపారు.శిక్షణ పొందే అభ్యర్థులకు ఉచిత వసతి (హాస్టల్), ఉచిత భోజనం, పూర్తిగా ఉచిత శిక్షణ సౌకర్యాలు కల్పించబడతాయని వెల్లడించారు.అదేవిధంగా శిక్షణ పూర్తయిన అనంతరం 100 శాతం ప్లేస్‌మెంట్ సహాయం అందించబడుతుందని తెలిపారు.ఈ కోర్సుల్లో చేరేందుకు ఎలాంటి సాంకేతిక అనుభవం అవసరం లేదని, ప్రాక్టికల్, థియరీ విధానాల్లో సమగ్ర శిక్షణ అందించబడుతుందని వివరించారు. ఆసక్తి గల నిరుద్యోగ యువకులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు:www.bired.org మరిన్ని వివరాల కోసం 9398524699, 9494963976 నంబర్లను సంప్రదించాలని కోరారు.

# ఖమ్మం ఘటనలోని నిందితుడి పై కఠిన చర్యలు తీసుకోవాలి : విహెచ్‌పీ



జనగామ, ప్రజాస్ఫూర్తి : ఖమ్మం జిల్లాలో మైనర్ బాలికపై జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అత్యాచార ఘటనలో నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుని బాధితురాలికి న్యాయం చేయాలని విశ్వహిందూ పరిషత్ (విహెచ్‌పీ) జిల్లా శాఖ డిమాండ్ చేసింది.శనివారం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో విహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు అడ్వకేట్ ఎనగందుల బిక్షపతి మాట్లాడుతూ,ఖమ్మం జిల్లాలో జరిగిన ఘటన పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మైనర్ బాలికపై అత్యంత దారుణంగా దాడి జరిగినట్లు వస్తున్న సమాచారం కలచివేస్తోందన్నారు.ఈ కేసులో నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న గౌస్ పాషా పై చట్టపరంగా అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని, బాధితురాలికి పూర్తి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. బాలిక వైద్యం,విద్య తదితర అంశాల్లో ప్రభుత్వం ప్రత్యేక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మహిళలు, బాలికల భద్రతకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలని, నేరస్తులపై వేగవంతమైన విచారణ జరిపి శిక్షలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని, పోలీసు యంత్రాంగాన్ని కోరారు. ఈ సమావేశం లో జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ మోహనకృష్ణ భార్గవ,నగర అధ్యక్షులు అంబటి బాలరాజు, జిల్లా సేవా ప్రముఖ్ బత్తిని శ్రీనివాస్, సంస్కార శిక్షణ ప్రముఖ్ గుర్రం సదన్‌రావు, జిల్లా సహ కార్యదర్శి చిలువేరు హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కుంభం



భువనగిరి ప్రజాస్ఫూర్తి :సింగన్నగూడెం 2 బీహెచ్కె పెండింగ్ పనులను శనివారం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీలో చేపట్టాల్సిన మౌలిక వసతుల పనులు, తాగునీటి సరఫరా, విద్యుత్ సౌకర్యాలు, అంతర్గత రహదారులు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు.పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చేలా సంబంధిత అధికారులు పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ శ్రీవాణి రవికుమార్ ,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# హస్త కళలను కాపాడుకోవాలి

- **ఫ్యాషన్ డిజైనర్ కృష్ణమూర్తి**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: హస్త కళలను కాపాడుకుంటూ.. భవిష్యత్ తరాలకు అందించాలని ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ కే. కృష్ణమూర్తి అన్నారు. చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం టెక్స్ టైల్ పార్కులోని మిమి క్రాఫ్ట్స్ ను హైదరాబాదుకు చెందిన అర్నిత ఫ్యాషన్ డిజైనింగ్ కళాశాల విద్యార్థుల బృందం శనివారం సందర్శించింది. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ భారతదేశంలో పూర్వ కాలం నుంచి బాతిక్, స్క్రీన్, బ్లాక్, టై అండ్ డై ప్రింటింగ్ పద్ధతులు వివిధ రూపాల్లో అమలులో ఉన్నాయని విద్యార్థులకు వివరించారు. మారుతున్న ఫ్యాషన్లకు అనుగుణంగా ఈ కలలను నవీకరించి నూతన డిజైన్లను సృష్టించి ప్రజలకు అందించాల్సిన బాధ్యత కళాకారులపై, ఫ్యాషన్ డిజైనర్ లపై ఉందని సూచించారు. ఈ ప్రాచీన కళలతో నేటి ఫ్యాషన్లకు అనుగుణంగా వస్త్రాలను తయారు చేసే పద్ధతులను ప్రయోగాత్మకంగా ప్రదర్శించారు. మిమి క్రాఫ్ట్స్ నిర్వాహకురాలు పుష్పలత, తిరుపతికి చెందిన దివ్య, ఫ్యాషన్ డిజైనింగ్ కళాశాల అధ్యాపకులు రచన, హర్షిత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బెలిదె శ్రీనివాసులు జన్మదిన వేడుకలు



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: ఆర్యవైశ్య మహాసభ సూర్యాపేట పట్టణ అధ్యక్షులు బెలిదె శ్రీనివాసులు జన్మదిన వేడుకలు శనివారం సాయంత్రం స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫ్రూట్ కటింగ్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా విచ్చేసిన నాయకులు బెలిదె శ్రీనివాసులుకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు, కొందరు పుట్టినరోజు సందర్భంగా నోట్ బుక్ అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఉప్పల సత్యనారాయణ, వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటి చైర్మన్ పోతుగంటి వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య నాయకులు బిక్కుమళ్ల కృష్ణ, డ్రీమ్స్ మొబైల్స్ ఉప్పల శ్రవణ్ ,చల్లా లక్ష్మీకాంత్, రాచకొండ శ్రీనివాస్,మిట్టపల్లి రమేష్,మంచాల రంగయ్య, సోమ ప్రవీణ్, సోమ వెంకటేశ్వర్లు, డోగుపర్తి ప్రవీణ్, బచ్చు శ్రీనివాస్, మిర్యాల సుధాకర్, గోపారపు రాజు, బెలిదె అంజయ్య, భోనగరి కృష్ణ, కందిబండ ఉమా మహేశ్వరరావు, తల్లాడ మోహన్ రావు,తల్లాడ ఉపేందర్,, కొత్త వెంకటేశ్వర్లు, శ్రీరంగం రాము, కుంచపర్తి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు

# పరిశుభ్రమైన పరిసరాల కోసం పౌరుల భాగస్వామ్యం అత్యంత కీలకం

*** కూకట్ పల్లి సర్కిల్ డిసి ఆంజనేయులు**

కూకట్ పల్లి, ప్రజాస్పూర్తి : పరిశుభ్రమైన పరిసరాల కోసం పౌరుల భాగస్వామ్యం అత్యంత కీలకమని కూకట్ పల్లి సర్కిల్ డిసి ఆంజనేయులు అన్నారు. సైబరాబాద్ 99 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా కూకట్‌పల్లి జోన్ పరిధిలో గుర్తించిన పలు గార్బేజ్ వల్నరబుల్ పాయింట్లు ప్రజల భాగస్వామ్యం, సమన్వయం పారిశుద్ధ్య సిబ్బంది కృషితో విజయవంతంగా నిర్మూలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజల సహకారంతో పాటు పారిశుద్ధ్య సిబ్బంది , రామ్‌కీ సంస్థ సిబ్బంది చురుకుగా



పాల్గొని పలు గార్బేజ్ వల్నరబుల్ పాయింట్లను లక్ష్యంగా తీసుకొని శుభ్రపరిచారు. అనంతరం ఆ ప్రదేశాలను పూలతో, రంగవల్లులతో అలంకరించి పరిశుభ్రమైన వాతావరణాన్ని సృష్టించారు.ఈ సందర్భంగా స్థానిక ప్రజలు గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ల నిర్మూలనపై హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఈ ప్రాంతాల్లో చెత్త వేయకుండా పరిశుభ్రతను కాపాడేందుకు తమవంతు బాధ్యతగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రోడ్లపై చెత్త వేయకుండా, పారిశుద్ధ్య సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని సూచించారు. సమాజం, పారిశుద్ధ్య సిబ్బంది , స్థానిక సంస్థల సమిష్టి కృషితో పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన నగర నిర్మాణం సాధ్యమవుతుందని అధికారులు తెలిపారు.

# ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి

*** మేడ్చల్ జిల్లా బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్**



మేడిపల్లి, ప్రజాస్పూర్తి : ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని మేడ్చల్ జిల్లా బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ కొత్త చందర్ గౌడ్ లు అన్నారు. శనివారం మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని చెంగిచెర్ల డివిజన్ శ్రీ లక్ష్మీ నగర్ కాలనీలో నూతన డ్రైనేజీ పనులకు వారితో పాటు కాంగ్రెస్ సీనియర్ నాయకులు కుర్రి శివశంకర్, ప్రభాకర్ గౌడ్లు ముఖ్య అతిథులుగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షకాలంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా నూతన డ్రైనేజ్ పైప్ లైన్ పనులు ప్రారంభించామన్నారు. యుద్ధ ప్రాతిపదికన డ్రైనేజీ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ లక్ష్మీ నగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు సందీప్, కాలనీ అసోసియేషన్ సభ్యులు, డివిజన్ నాయకులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిలో 'బొగ్గు మాయం'పై విచారణ జరిపించండి.. రేవంత్‌కు కిషన్‌రెడ్డి లేఖ

హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి బహిరంగ లేఖ రాశారు. సింగరేణిలో అవకతవకలు జరిగాయంటూ వచ్చిన వార్తలపై ఆందోళన వ్యక్తం చేశారు. ''సింగరేణి నుంచి దాదాపు రూ.1,600 కోట్ల విలువైన 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని మీడియాలో కథనాలు వచ్చాయి. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలి. భద్రతను కఠినతరం చేయాలి. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి రూ.51,500కోట్లకు పైగా బకాయి పడి ఉంది. దీంతో సంస్థపై ఆర్థిక ఒత్తిడి నెలకొంది. సంస్థలో సేఫ్‌గార్డ్స్, ఇంటర్నల్ కంట్రోల్ సిస్టమ్ పనితీరును సమీక్షించాలి. సింగరేణి సామర్థ్యం, పారదర్శకత, విశ్వసనీయతను బలోపేతం చేయాలి'' అని లేఖలో పేర్కొన్నారు. 40 వేల మందికి పైగా ఉన్న సింగరేణి కార్మికులు, వారి కుటుంబాల సంక్షేమంతోపాటు సంస్థ భవిష్యత్తును కాపాడటం మన అందరి బాధ్యత అని చెప్పారు.

# జీడిమెట్ల లో 7 మంది బంగ్లాదేశ్ జాతీయులు అరెస్ట్

జీడిమెట్ల, ప్రజాస్పూర్తి : గాజులరామారం హెచ్ఎఎల్ కాలనీలో ఓ ఇంట్లో అక్రమంగా అద్దెకు ఉంటున్న 7 గురు బంగ్లాదేశ్ జాతీయులను జీడిమెట్ల పోలీసులు అరెస్టు చేశారు. కుత్బుల్లాపూర్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) ఎన్. కోటి రెడ్డి ఆదేశాల మేరకు విశ్వసనీయ సమాచారం అధారంగా జీడిమెట్ల పోలీస్ స్టేషన్ సిబ్బంది హెచ్ఏఎల్ ఏరియాలో ఉన్న ఒక అద్దె ఇంట్లో కొంతమంది నివసిస్తున్నట్లు గుర్తించారు. ఈ సమాచారంపై చర్య తీసుకుంటూ, జీడిమెట్ల ఎస్‌హెచ్ఓ తన బృందంతో కలిసి ఆ ప్రదేశంలో సోదాలు నిర్వహించి ఏడుగురు (07) బంగ్లాదేశ్ జాతీయులను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో, అదుపులోకి తీసుకున్న వ్యక్తులలో ఎవరి వద్దా భారతదేశంలో ఉండేందుకు అనుమతించే చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్టులు, వీసాలు , ఇతర ప్రయాణ పత్రాలు లేవని తేలింది. ప్రాథమిక దర్యాప్తులో వారు భారతదేశంలోకి




అక్రమంగా ప్రవేశించి దేశంలోని వివిధ ప్రాంతాల్లో చట్టవిరుద్ధంగా నివసిస్తున్నట్లు వెల్లడైంది. దీంతో ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారిపై తగిన నిర్బంధ , కదలికల నియంత్రణ ఉత్తర్వులను పొందారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తులను మెదక్ జిల్లా జోగిపేటలోని డిపోర్టేషన్ సెంటర్‌కు తరలిస్తున్నారు. నిర్దేశించిన చట్టపరమైన విధానం ప్రకారం వారి బహిష్కరణ ప్రక్రియను ప్రారంభించారు. సంబంధిత అధికారులచే అవసరమైన లాంఛనాలు , ధృవీకరణ పూర్తయిన తర్వాత, వారిని బంగ్లాదేశ్‌కు బహిష్కరించి, వారి స్వస్థలాలకు తిరిగి పంపిస్తారు. ఈ ఆపరేషన్ లో ఎస్ఓటి కూకట్ పల్లి జోన్ సిబ్బంది పాల్గొన్నారు.

# డీవీపీపై అదనపు భారం.. రైతులకు పెరిగిన ఖర్చు..

నర్మెట/జనగామ, ప్రజాస్పూర్తి : సాగు మొదలవుతున్న వేళ రైతులకు మరో సారి అదనపు భారం పడింది. రాష్ట్ర ప్రభుత్వం డీఏపీ ఎరువుల కొరతను అధిగమించేందుకు ప్రత్యామ్నాయంగా డీవీపీ (డిఏపి ప్రత్యామ్నాయ ఎరువు) వినియోగాన్ని ప్రోత్సహిస్తున్న నేపథ్యం లో, రైతులు డీవీపీతో పాటు తప్పనిసరి గా మరో బస్తా ఎరువును కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం డీవీపీ బస్తా ధర సుమారు రూ.1,350 కాగా, దాని తోపాటు మరో బస్తా ఎరువును కొనుగోలు చేయాల్సి రావడంతో రైతుపై అదనంగా రూ.450 వరకు భారం పడుతోంది. జిల్లా వ్యాప్తంగా 149 బస్తా లను రైతులకు విక్రయించినట్లు అధికా రులు వెల్లడించారు. ఎరువుల విక్రయ కేంద్రాల్లో డీవీపీ బస్తా తోపాటు ఇతర ఎరువులను కూడా కొనుగోలు చేయా లని సూచించడం వల్ల రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సాగు ఖర్చు లు ఇప్పటికే పెరిగిన తరుణంలో అదన పు వ్యయం భారంగా మారిందని రైతు లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయి తే, డీఏపీ కొరతను దృష్టిలో ఉంచుకుని పంటల అవసరాలకు అనుగుణంగా ప్ర త్యామ్నాయ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నామని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. రైతులు ఆందోళన చెందకుండా శాస్త్రీయ పద్ధతుల్లో ఎరువులను వినియోగించాలని సూచించారు.



## అయోధ్య విరాళాల వివాదం..

# సిట్ ఏర్పాటు చేయాలని వినతి

అయోధ్య రామ మందిర విరాళాలు, కానుకల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై విచారణ జరపాలని శ్రీ రామ్ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ యూపీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ విషయంపై ప్రత్యేక దర్యాప్తు బృందం (SIT)తో విచారణ జరిపించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను కోరింది.


**CBI విచారణకు పిల్..**

అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణలపై సీబీఐ విచారణ చేపట్టాలని కోరుతూ అలహాబాద్ హైకోర్టులో పిల్ దాఖలైంది. న్యాయవాది మోహిత్ అశోక్ దీన్ని దాఖలు చేశారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఖాతాలపై కాగ్ ద్వారా సమగ్రమైన ఆడిట్ కూడా నిర్వహించాలని కోరారు. విరాళాల విషయంలో చాలాకాలంగా అవకతవకలు జరుగుతున్నాయని రామ మందిర అకౌంట్స్ ఇన్‌ఛార్జిగా ఉన్నానని చెప్పుకొంటున్న మహిపాల్ సింగ్ ఆరోపించడంతో ఈ వివాదం నెలకొంది. ఈ విషయంపై ఫిర్యాదు చేసినందుకే తనను విధుల నుంచి తొలగించారని సింగ్ తెలిపారు.




# వైమానిక స్థావరంలో కూలిన విమానం.. ఐదుగురి మృతి

అస్సాంలోని జోర్హాట్ వైమానిక స్థావరంలో విమాన ప్రమాదం చోటుచేసుకుంది. భారత వైమానిక దళానికి చెందిన ఏఎన్32 రవాణా విమానం ఎయిర్‌బేస్ లోపల ల్యాండ్ అవుతుండగా, మంటలు చెలరేగడంతో కూలిపోయింది. ఈ ఘటనలో వాయుసేనకు చెందిన ఐదుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారని ఐఏఎఫ్ అధికారులు వెల్లడించారు. తీవ్రంగా గాయపడిన కోపైలట్‌కు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రమాదానికి గల కారణాలను తెలుసుకునేందుకు అత్యున్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించినట్లు అధికారులు పేర్కొన్నారు. మృతులను స్క్వాడ్రన్ లీడర్ ప్రశాంత్ సింగ్, ఫ్లైట్ లెఫ్టినెంట్ శుభమ్ కుమార్, సార్జెంట్ జితేంద్ర శర్మ, అగ్నివీర్ (వాయు)కు చెందిన ఖేమరామ్ కుమావత్, డానిష్ ఆలమ్‌గా గుర్తించారు. రాజ్‌నాథ్ సింగ్ దిగ్భ్రాంతి.. విమాన ప్రమాదంలో వాయుసేనకు చెందిన ఐదుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోవడంపై రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన వాయుసేన యోధుల కుటుంబాలకు అండగా ఉంటామని పేర్కొన్నారు. దేశానికి వారు అందించిన సేవలను ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటామన్నారు. ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. ఏఎన్32 జెట్ దృఢమైన,



రెండు ఇంజన్లు గల టర్బోప్రాప్. ఈ సైనిక రవాణా విమానాన్ని తీవ్రమైన వాతావరణ పరిస్థితులను తట్టుకునేలా రూపొందించారు. ఇది ఎత్తైన ప్రదేశాలలోని ఎయిర్‌ఫీల్డ్‌లలో, వేడి ఉష్ణమండల వాతావరణాల్లోనూ సమర్థంగా పనిచేస్తుంది. 7.5 టన్నుల సరకును, 50 మంది ప్రయాణికులను, 42 మంది పారాట్రూపర్‌లను రవాణా చేయగలదు. ప్రకృతి విపత్తుల సమయంలో మారుమూల ప్రాంతాలలో సామగ్రిని జారవిడవడానికి ఈ విమానాన్ని విస్తృతంగా ఉపయోగిస్తారు.

## 'నీట్ పేపర్ మళ్లీ లీక్'

# ప్రచారం ఫేక్.. PIB ఫ్యాక్ట్‌చెక్

ఢిల్లీ : నీట్ ప్రశ్నపత్రం మళ్లీ లీక్ అంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న దుష్ప్రచారాన్ని కేంద్రం ఖండించింది. ఈ ప్రచారం పూర్తిగా అవాస్తవమంటూ కొట్టిపారేసింది. ఈ మేరకు పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టింది. నీట్ రీఎగ్జామ్ ప్రశ్నపత్రం సైతం లీక్ అయినట్టుగా కొందరు నకిలీ వార్తలను ప్రచారం చేస్తున్నారని, అలాంటి వాటిని నమ్మొద్దని విద్యార్థులు, తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేసింది. నీట్ పరీక్షకు సంబంధించి ఏదైనా అధికారిక సమాచారం కోసం neet.nta.nic.in వెబ్‌సైట్‌ను సందర్శించి చెక్ చేసుకోవాలని సూచించింది. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి ఏవైనా అనుమానాస్పద కంటెంట్ మీ దృష్టికి వస్తే వాట్సప్ నంబర్ +91 8799711259కు గానీ, Email: factcheck@pib.gov.in ద్వారా గానీ తమకు రిపోర్టు చేయాలని కోరింది.

*** నీట్ రీ-ఎగ్జామ్ సమయం 15 నిమిషాలు పెంపు**

మరోవైపు, దేశ వ్యాప్తంగా ఈ నెల 21న మళ్లీ నిర్వహించనున్న నీట్‌కు సంబంధించిన




నియమావళిలో ఎన్‌టీఏ పలు మార్పులు చేసింది. విద్యార్థుల సౌకర్యార్థం పరీక్షా సమయాన్ని 15 నిమిషాలు పొడిగిస్తున్నట్లు నిన్న ప్రకటించింది. మధ్యాహ్నం 2 గంటల నుంచి 5.15 గంటల వరకు పరీక్ష జరగనుందని తెలిపింది. ప్రశ్నపత్రం బుక్‌లెట్‌లో రఫ్ వర్క్ కోసం కేటాయించిన పేజీల సంఖ్యనూ రెండు నుంచి నాలుగుకు పెంచినట్లు వెల్లడించింది.

# అభిషేక్‌ను క్షమించాను: కల్యాణ్ బెనర్జీ యూటర్న్

అభిషేక్ కావాలో, తాను కావాలో తేల్చుకోవాలని మమతా బెనర్జీకి అల్టిమేటం జారీ చేసిన కల్యాణ్ బెనర్జీ యూటర్న్ తీసుకున్నారు. అభిషేక్ విషయంలో మాట మార్చారు. అతడు తన కొడుకులాంటి వాడని.. కొడుకు తప్పు చేస్తే క్షమించే గుణం తండ్రికి ఉంటుందని పేర్కొన్నారు. అభిషేక్‌ను క్షమిస్తున్నట్లు తెలిపారు. ఎన్డీఏ అధికారంలోకి వచ్చాక బెంగాల్‌లో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్నారు. ప్రతిపక్షం పూర్తిగా తుడిచిపెట్టుకుపోయే పరిస్థితిని బెంగాల్ ఎప్పుడూ ఎదుర్కోలేదన్నారు. టీఎంసీని వీడిన ఎంపీలపై కల్యాణ్ బెనర్జీ తీవ్ర విమర్శలు చేశారు. భాజపా వేసిన ఎత్తుగడను అర్థం చేసుకోలేక వారంతా పార్టీని వీడారని..ఇప్పుడు ఆ పార్టీ నేతల నీడలో



బతకాల్సి వస్తుందని పేర్కొన్నారు. టీఎంసీ, కాంగ్రెస్‌లో విలీనమవ్వనుందని వస్తున్న వార్తలను ఖండించారు. కాగా కల్యాణ్ బెనర్జీ గురువారం మీడియాతో మాట్లాడుతూ మమతకు అల్టిమేటం జారీ చేశారు. అభిషేక్ కావాలో, తాను కావాలో తేల్చుకోవాలన్నారు. ''అభిషేక్ వల్లే ఈ రోజు పార్టీ నాశనమైంది. అహంకారంతో ఆయన ప్రవర్తిస్తున్నారు. సీనియర్లకు గౌరవం ఇవ్వరు. నేను ఇప్పటికీ మమత వైపే ఉన్నాను. అయితే ఎవరు కావాలో దీదీ తేల్చుకోవాలి. అభిషేక్ వైపు ఉండాలని ఆమె నిర్ణయించుకుంటే.. నేను నా నిర్ణయం తీసుకుంటా'' అని స్పష్టం చేశారు. కలకత్తా హైకోర్టులో విచారణ జరుగుతున్న సంతకాల ఫోర్జరీ కేసులో తాను అభిషేక్ న్యాయవాదిగా ఉన్నానని, కానీ తనకు తెలియకుండా ఈ వ్యాజ్యంలో మరో పిటిషన్‌ను జూనియర్ లాయర్ వేశారని అన్నారు. ఇది తనకు అవమానకరమని బెనర్జీ అన్నారు. అభిషేకే ఈ పని చేయించారని.. ఇక నుంచి ఆయన కేసులు తాను వాదించనని తెలిపారు.

# చమురు నౌకలపై దాడులు సమంజసం కాదు: భారత్

న్యూఢిల్లీ, జూన్ 13 : ఒమన్ తీరంలో భారతీయులు ఉన్న నౌకలపై అమెరికా దాడి చేయడాన్ని భారత్ మరోసారి తీవ్రంగా తప్పుబట్టింది. ఈ విషయంపై అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియోతో.. భారత విదేశాంగ మంత్రి జై శంకర్ మాట్లాడారు. ఈసందర్భంగా దాడిపై ఆయన నిరసనను తెలియజేశారు. రూబియోతో శుక్రవారం సాయంత్రం మాట్లాడినట్లు జై శంకర్ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. గల్ఫ్‌లో అమెరికా జరిపిన దాడుల్లో ముగ్గురు భారత నావికులు మరణించడంపై భారత్ తరఫున నిరసనను తెలియజేశారు. వాణిజ్య నౌకలపై ఇలాంటి దాడులు సమంజసం కాదని వ్యాఖ్యానించారు. ఇక, ఈ విషయంపై ఢిల్లీలో అమెరికా దౌత్యాధికారి జేసన్ మీక్స్‌కు విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ రెండుసార్లు సమన్లు జారీ చేసిన సంగతి తెలిసిందే.

# అర్ధరాత్రి అభిషేక్ బెనర్జీ నివాసంలో పోలీసుల తనిఖీలు

కోల్‌కతా, జూన్ 13 : టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీ నివాసంలో శుక్రవారం రాత్రి పోలీసులు తనిఖీలు చేపట్టారు. భూ కుంభకోణానికి సంబంధించిన కేసులో దర్యాప్తు నిమిత్తం కాళీఘాట్‌లోని ఆయన నివాసానికి వెళ్లిన పోలీసులు, కేంద్ర భద్రతా బలగాలు ఇంటి తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించినట్లు పార్టీ వర్గాలు ఆరోపించాయి. ఈ ఆపరేషన్ గురించి తెలుసుకున్న పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ హుటాహుటిన అభిషేక్ నివాసానికి చేరుకున్నారు. సల్బోని ప్రాంతంలోని ఓ భూమికి సంబంధించిన కేసులో నిందితుడిగా ఉన్న అభిషేక్ బెనర్జీ అనుచరుడి కోసం తాము గాలిస్తున్నట్లు దర్యాప్తు అధికారులు పేర్కొన్నారు. అభిషేక్ నివాసంలో నాలుగు గంటలకు పైగా సోదాలు నిర్వహించినట్లు తెలిపారు. అయితే పోలీసులతో పాటు కేంద్ర భద్రతా బలగాలు కూడా తనిఖీల్లో పాల్గొనడంతో టీఎంసీ కార్యకర్తలు పెద్దఎత్తున నిరసన తెలిపారు. రాజకీయ కుట్రలో భాగంగానే ఈ ఆపరేషన్ చేపట్టారని విమర్శించారు.

**మంచం కింద డబ్బులు, పత్రాలు..**

మరో ఘటనలో మున్సిపాలిటీ నియామకాల కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ED) అధికారులు టీఎంసీ ఎమ్మెల్యే మదన్‌మిత్ర నివాసంపై దాడులు చేశారు. కామర్‌హతి మున్సిపాలిటీతో సహా వివిధ మున్సిపాలిటీల్లోని పోస్టులలో మదన్ మిత్ర అనర్హులైన అభ్యర్థులను నియమించినట్లు వెల్లడించారు.







# లక్ష కోట్ల డాలర్లాధీశుడు.. మస్క్

* **స్పేస్ఎక్స్ షేర్ల నమోదుతో ప్రపంచంలోనే తొలి ట్రిలియనీర్‌గా ఆవిర్భావం**



2026 జూన్ 12.. ఈ తేదీని ప్రపంచం అంత సులువుగా మరచిపోలేదు. ఈ రోజు అమెరికా మార్కెట్లలో స్పేస్ఎక్స్ షేర్లు నమోదయ్యాయి. అంతే కాదు.. ఆ కంపెనీ అధిపతి ఎలాన్ మస్క్ ప్రపంచానికి తొలి ట్రిలియనీర్ (లక్ష కోట్ల డాలర్లు/ సుమారు రూ.95 లక్షల కోట్లకు పైగా సంపద కలిగిన వ్యక్తి)గా అవతరించారు. ఇప్పటివరకు ఈ స్థాయి సంపదకు చేరిన ఏకైక వ్యక్తి మస్క్ మాత్రమే.

**ఎలా సాధ్యమైందంటే :** శుక్రవారం నాస్‌డాక్‌లో స్పేస్ఎక్స్ షేరు 150 డాలర్ల వద్ద లిస్ట్ అయింది. పబ్లిక్ ఇష్యూ ధర(135 డాలర్లు)తో పోలిస్తే ఇది 11% అధికం. దీంతో ఈ ఏరోస్పేస్ కంపెనీ విలువ 1.96 లక్షల కోట్ల డాలర్ల (రూ.186 లక్షల కోట్లకు పైగా)కు చేరింది. అమెరికాలో మార్కెట్ విలువ పరంగా అతిపెద్ద ఆరో కంపెనీగా నిలిచింది. ఈ కంపెనీ ఐపీఓలో భాగంగా 75 బిలియన్ డాలర్ల విలువైన షేర్లను విక్రయించింది.

**బ్లూమ్‌బర్గ్ న్యూస్ ప్రకారం..** సంస్థాగత మదుపర్లలో 70% మంది ఈ ఐపీఓలో దీర్ఘకాలిక దృక్పథంతోనే పెట్టుబడులు పెట్టారు. న్యూయార్క్ నగరంలో నాస్‌డాక్ మార్కెట్ సైట్ వద్ద కంపెనీ ప్రెసిడెంట్ గ్విన్ షాట్‌వెల్, చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ బ్రెట్ జాన్సన్ ప్రారంభ గంటను మోగించారు.

**ఎలాన్ సంపద ఎంతంటే..:** స్పేస్ఎక్స్ ఐపీఓ షేరు విలువను 135 డాలర్లుగా లెక్కగట్టిన గురువారమే, మస్క్ సంపద విలువ 982 బిలియన్ డాలర్లకు చేరుకుంది. శుక్రవారం నాస్‌డాక్‌లో షేర్లు 150 డాలర్ల వద్ద ట్రేడింగ్ ప్రారంభించాక, ఈ విలువ మరింత పెరిగింది. ఈ కంపెనీలో మస్క్‌కు 480 కోట్ల షేర్లుండడంతో, మస్క్ సంపద విలువ 1.1 ట్రిలియన్ డాలర్లని ఫోర్బ్స్ అంచనా వేసింది. మస్క్‌కు 1.5 లక్షల కోట్ల డాలర్ల విలువైన టెస్లాలో 10% వాటా, 8% స్టాక్ ఆప్షన్స్‌తో పాటు మరో అంకురం న్యూరాలింక్, ఇంకో సంస్థ బోరింగ్ కంపెనీలో చిన్నపాటి వాటాలూ ఉన్నాయి. రాత్రి 11:45 గంటలకు నాస్‌డాక్‌లో స్పేస్ఎక్స్ షేరు 169.85 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఫలితంగా కంపెనీ మార్కెట్ విలువ 2.22 లక్షల కోట్ల డాలర్లకు, మస్క్ సంపద విలువ 1.2 లక్షల కోట్ల డాలర్లకు చేరింది.

# మ్యాగీలో పురుగుల వార్తలు.. ఖండించిన నెస్లే ఇండియా




మ్యాగీ నూడుల్స్‌లో పురుగులున్నాయంటూ సామాజిక మాధ్యమాల్లో వస్తోన్న ఆరోపణలను ఎఫ్ఎంసీజీ దిగ్గజం నెస్లే ఇండియా ఖండించింది. అవన్నీ నిరాధారణ ఆరోపణలని కొట్టిపారేసింది. తమ ఉత్పత్తులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయని స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఇచ్చిన ఫైలింగ్‌లో కంపెనీ స్పష్టం చేసింది. మ్యాగీ నూడుల్స్‌లో పురుగులు ఉన్నాయంటూ సోషల్ మీడియా వేదికగా ఓ యూజర్ నుంచి వచ్చిన ఆరోపణలను ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా తమ దృష్టికి తీసుకొచ్చినట్లు నెస్లే ఇండియా పేర్కొంది. ఇప్పటివరకు ఆ ఫిర్యాదుదారు నుంచి ఎలాంటి శాంపిల్స్ అందలేదని, కాంటాక్ట్ చేయడానికి ప్రయత్నించినా ఆ యూజర్ వివరాలు తెలియరాలేదని కంపెనీ పేర్కొంది. “మ్యాగీ నూడుల్స్ శాంపిల్స్‌ను నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లాబొరేటరీస్‌కు పంపించగా, మా ఉత్పత్తుల్లో ఎలాంటి పురుగులు లేవని ధృవీకరించింది. ఎఫ్ఎస్ఎస్ఏఐ నిబంధనలకు అనుగుణంగా ఉత్పత్తులు ఉన్నట్లు నివేదిక వచ్చింది. వినియోగదారుల ఆరోగ్యం, నాణ్యత విషయంలో రాజీపడబోం. కఠినమైన నాణ్యతా ప్రమాణాలను పాటిస్తాం’’ అని నెస్లే ఇండియా వెల్లడించింది.

## ఆంథ్రోపిక్‌కు మరో తలనొప్పి..

# ఫ్యాబిల్, మిథోస్‌పై అమెరికా బ్యాన్..!


శక్తిమంతమైన ఏఐ మోడళ్లను అభివృద్ధి చేస్తూ అమెరికా సర్కార్ ఆగ్రహానికి గురవుతోన్న కృత్రిమ మేధ సంస్థ ‘ఆంథ్రోపిక్’ మరోసారి వార్తల్లో నిలిచింది. ఈ కంపెనీ ఇటీవల విడుదల చేసిన తమ సరికొత్త ఏఐ మోడళ్లు ‘ఫ్యాబిల్ 5’, ‘మిథోస్ 5’ సేవలను తాజాగా నిలిపివేసింది. దేశ భద్రతా కారణాల రీత్యా ఈ మోడళ్లపై అమెరికా ప్రభుత్వం ఆంక్షలు విధించడంతో ఆంథ్రోపిక్ ఈ నిర్ణయం తీసుకుంది. కాగా.. ఫ్యాబిల్ 5ను విడుదల చేసిన మూడు రోజులకే ఈ పరిణామాలు చోటుచేసుకోవడం గమనార్హం. ఫ్యాబిల్ 5, మిథోస్ 5 ఏఐ మోడళ్లపై భద్రతాపరమైన ఆందోళనలను వ్యక్తంచేసిన అమెరికా ప్రభుత్వం.. వాటిని విదేశీ పౌరులకు నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఆంథ్రోపిక్‌లో పనిచేసే విదేశీ ఉద్యోగులకు కూడా ఈ మోడళ్ల యాక్సెస్ ఉండకూడదని స్పష్టంచేసింది. ఈమేరకు అమెరికా




వాణిజ్య మంత్రి హోవర్డ్ లుట్నిక్ కంపెనీకి లేఖ పంపినట్లు తెలిసింది. దీనిపై స్పందించిన ఆంథ్రోపిక్.. విదేశీ పౌరులే గాక, యూజర్లందరికీ ఈ సేవలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ ఏఐ మోడళ్లపై నిషేధానికి గల కారణాలను అమెరికా ప్రభుత్వం అధికారికంగా వెల్లడించలేదు. అయితే, ఇందులోని అధునాతన సాంకేతికత సాయంతో సైబర్ నేరగాళ్లు సులువుగా హ్యాకింగ్‌కు పాల్పడే అవకాశం ఉందని ట్రంప్ సర్కారు ఆరోపించింది. ఈ ఏఐ టూల్స్‌తో కోడ్‌లోని సాఫ్ట్‌వేర్ లోపాలను సులువుగా గుర్తించి హ్యాకర్లు దుర్వినియోగం చేసే ముప్పు ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిణామాలపై ఆంథ్రోపిక్ స్పందించింది. “ఈ మోడళ్లు దుర్వినియోగం అయ్యే అవకాశం అత్యంత తక్కువగా ఉంది. ఇప్పటికే అందుబాటులో ఉన్న ఎన్నో మోడళ్లు కూడా హ్యాకర్లకు అదనపు సామర్థ్యాలను కలిగిస్తున్నాయి. ఈ ఒక్క కారణంతో కోట్లాది మంది కోసం రూపొందించిన కమర్షియల్ మోడల్‌ను రీకాల్ చేసుకోవడం అత్యంత బాధాకరం. మా సెక్యూరిటీ టెస్టింగ్‌లలో మేం ఎలాంటి లోపాలను గుర్తించలేదు’’ అని ఆంథ్రోపిక్ వెల్లడించింది. గత మంగళవారమే ప్యాబిల్ 5 మోడల్‌ను ఈ సంస్థ విడుదల చేసింది. ఇది మిథోస్ 5కు అధునాతన వెర్షన్. ‘ప్రాజెక్ట్ గ్లాస్‌వింగ్’లో భాగంగా ఆంథ్రోపిక్ సంస్థ క్లాడ్ మిథోస్‌ను తెరపైకి తెచ్చింది. ఇది అధునాతన ఏఐ నమూనా. ఆయా సంస్థల సాఫ్ట్‌వేర్‌లో లోపాలను గుర్తించి, సైబర్ భద్రతను మెరుగుపరచడానికి దీన్ని రూపొందించారు. ఎంపిక చేసిన కొన్ని కంపెనీలకు మాత్రమే ఈ టూల్ యాక్సెస్‌ను ఆంథ్రోపిక్ కల్పించింది. భారత్‌లోనూ కొన్ని కంపెనీలు ఈ జాబితాలో ఉన్నాయి.

## తమ్ముడి దూకుడు..

# వైభవ్ సూర్యవంశీ రికార్డు బద్దలవుతుందా?








వైభవ్ సూర్యవంశీనే ఓ సంచలనం అనుకుంటే.. అతడి 10 ఏళ్ల తమ్ముడు ఆశీర్వాద్ సూర్యవంశీ కూడా అన్న బాటలోనే పయనిస్తున్నాడు. బిహార్‌లోని ఓ లోకల్ మ్యాచ్‌లో అతడు సెంచరీ బాదాడు. వైభవ్ మాదిరిగానే ఆశీర్వాద్ కూడా ఓపెనర్ కావడం గమనార్హం. ఈ మేరకు అతడి స్కోరు కార్డు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తన తమ్ముడి సెంచరీపై వైభవ్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా స్పందించాడు. ‘కంగ్రాట్స్ ఆశీర్వాద్’ అంటూ ఇన్‌స్టా స్టోరీస్‌లో స్కోర్‌కార్డుతోపాటు తన సోదరుడి ఫొటోను షేర్ చేశాడు.

* **అన్నదమ్ములు కలిసి..**

ఇప్పుడు సోషల్ మీడియాలో వైభవ్‌తోపాటు అతడి సోదరుడు ఆశీర్వాద్ చర్చనీయాంశంగా మారాడు. పదేళ్ల వయసులోనే ఇంతటి భారీ ఇన్నింగ్స్‌లు ఆడటంపై అందరూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అన్నలాగే తమ్ముడు కూడా టీనేజీలోనే జాతీయ జట్టులోకి అడుగుపెట్టేస్తాడని క్రికెట్ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. అదే జరిగి.. వీరిద్దరూ ఓపెనర్లుగా వస్తే ప్రత్యర్థుల పరిస్థితి ఏంటో తెలియడం లేదంటూ ఒకరు కామెంట్ చేశారు. ఇప్పటికే వైభవ్ జాతీయ జట్టులోకి అడుగు పెట్టిన సంగతి తెలిసిందే. 14 ఏళ్ల వయసులోనే అతడు ఐపీఎల్‌లో చెలరేగిపోయాడు. ఇప్పుడు ఆశీర్వాద్ వయసు 10 ఏళ్లు. ఇలాగే కొనసాగితే వైభవ్ రికార్డును సైతం బద్దలు కొట్టి ఐపీఎల్‌లోకి అడుగుపెట్టినా ఆశ్చర్యమేమీ లేదు. వైభవ్ సూర్యవంశీకి ముగ్గురు సోదరులు ఉన్నారు. వీరిలో ఇద్దరు అన్నలు కాగా.. ఒక తమ్ముడు. ఇందులో వైభవ్‌తోపాటు ఆశీర్వాద్ క్రికెటర్.

# అదంతా ఫ్రాంచైజీలు ఆటగాళ్లే చూసుకోవాలి: బీసీసీఐ




ఐపీఎల్‌కు సంబంధించి పలు కీలక అంశాలపై బీసీసీఐ సమీక్ష నిర్వహించింది. క్రికెట్ వర్గాల సమాచారం ప్రకారం.. విదేశీ ఆటగాళ్లు, ఫ్రాంచైజీల విషయంలో బీసీసీఐ జోక్యం చేసుకోదని స్పష్టత ఇచ్చింది. అలాగే వచ్చే వేలం కోసం పర్స్ విలువను పెంచాలనే విజ్ఞప్తిని తిరస్కరించింది. ఇక 2027 సీజన్‌ను ఇంకాస్త ముందుగానే ప్రారంభించడంపైనా కసరత్తు చేస్తున్నట్లు బీసీసీఐ పేర్కొంది. అలాగే రెండేళ్ల తర్వాత నుంచి ఐపీఎల్ మ్యాచులను పెంచేందుకూ ఆలోచన చేస్తున్నట్లు సమాచారం.

**మాకా ఉద్దేశం లేదు..**

విదేశీ ఆటగాళ్ల అందుబాటు విషయంలో ఇటీవల ముగిసిన సీజన్ సమయంలో ఫ్రాంచైజీలు ఆందోళన వ్యక్తం చేశాయి. దీనిపై బీసీసీఐ చర్యలు తీసుకోవాలనే డిమాండ్లూ వచ్చాయి. కానీ, ఈ విషయంలో జట్లకు, ఆటగాళ్లకు మధ్య వారధిగా వ్యవహరించాలనే ఉద్దేశం తమకు లేదని బీసీసీఐ స్పష్టం చేసింది. ఎవరైనా విదేశీ ప్లేయర్ వేలంలో సదరు ఫ్రాంచైజీకి వెళ్లాక.. సీజన్‌కు అందుబాటులో ఉండకపోతే రెండేళ్లపాటు బ్యాన్ విధించే అవకాశం ఉంది. అదీనూ గాయం కారణంగా చూపిస్తే మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోనక్కర్లేదు. ‘‘ఆటగాళ్లకు కస్టోడియన్స్ ఫ్రాంచైజీలే. అందుబాటులో ఉండటంపై వారికే వదిలేస్తున్నాం. కొందరు తమ జాతీయ జట్టు కోసం ఐపీఎల్‌లో పాల్గొనకూడదని నిర్ణయించుకుంటారు. కానీ, మా రూల్స్ మాత్రం స్పష్టంగా ఉన్నాయి. గాయం మినహా.. మరే ఇతర కారణమైనా సరే రెండేళ్లపాటు బ్యాన్ విధిస్తాం’’ అని బీసీసీఐ వర్గాలు పీటీఐకి తెలిపాయి.

**ఒకేసారి పెంచాల్సిన అవసరం లేదు..**

ప్రస్తుతం వేలంలోకి ప్రతి ఫ్రాంచైజీ రూ. 125 కోట్లతో వెళ్తుంది. అయితే, దీనిని మరింత పెంచాలనే డిమాండ్లు ఉన్నాయి. యూరోపియన్ ఫుట్‌బాల్ లేదా ఎన్ఎఫ్ఎల్‌తో పోలిక పెట్టుకోకూడదని బీసీసీఐ చెబుతోంది. ఒకేసారి పెద్ద మొత్తం కాకుండా.. నెమ్మదిగా పర్స్ విలువను పెంచుతూ వెళ్తామని బోర్డు స్పష్టం చేసింది.

**వచ్చే సీజన్ కాస్త ముందుగా..**

ఈ ఐపీఎల్ మార్చి చివరి నుంచి మొదలై మే 31న ముగిసింది. అయితే, వచ్చే ఏడాది వన్డే ప్రపంచ కప్ ఉంది. ఈ క్రమంలో ఐపీఎల్ 2027 సీజన్‌ను ఇంకాస్త ముందుగానే ప్రారంభించేందుకు బీసీసీఐ సన్నాహాలు చేస్తోంది. అలాగే 2028 సీజన్ నుంచి మ్యాచుల సంఖ్యను 74 నుంచి 94కు పెంచే అంశంపైనా చర్చించింది. అయితే, మార్చి తొలి వారం నుంచే ఐపీఎల్‌ను ప్రారంభిస్తేనే మే ఆఖరు నాటికి అనుకున్న టార్గెట్‌ను అందుకొనేందుకు అవకాశం ఉంటుంది. ద్వైపాక్షిక సిరీస్‌లకూ క్రికెట్ క్యాలెండర్‌లో చోటు కల్పించాల్సిన తరుణంలో దాదాపు రెండున్నర నెలలకుపైగా సమయం ఐపీఎల్‌కే కేటాయించడమూ సవాలే.







# రహ్మానుల్లా గుర్బాజ్ సెంచరీ.. ఔట్

భారత్‌తో జరుగుతున్న తొలి వన్డేలో అఫ్గానిస్థాన్ ఓపెనర్ రహ్మానుల్లా గుర్బాజ్ (101; 51 బంతుల్లో 8 ఫోర్లు, 8 సిక్సులు) సెంచరీ బాదాడు. 26 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయిన అఫ్గాన్‌ను గుర్బాజ్ అదిరే బ్యాటింగ్ చేసి ఆదుకున్నాడు. 25 బంతుల్లో అర్ధ శతకం అందుకున్న గుర్బాజ్ తర్వాత మరింత దూకుడు పెంచాడు. చివరకు నితీశ్ రెడ్డి వేసిన 16 ఓవర్లో క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. 16 ఓవర్లకు అఫ్గాన్ స్కోరు 143/4. హష్మతుల్లా షాహిదీ (27), అజ్మతుల్లా ఒమర్‌జాయ్ (1) క్రీజులో ఉన్నారు. వర్షం కారణంగా మ్యాచ్‌ను 25 ఓవర్లకు కుదించిన సంగతి తెలిసిందే. అఫ్గాన్ ఓపెనర్ రహ్మానుల్లా గుర్బాజ్ హాఫ్ సెంచరీ తర్వాత మరింత దూకుడు పెంచాడు. ప్రసిద్ధ్ కృష్ణ వేసిన 11 ఓవర్లో 4, 6 బాదిన అతను.. తర్వాత వాషింగ్టన్ సుందర్ బౌలింగ్‌లో రెండు సిక్సర్లు, ఓ ఫోర్ రాబట్టాడు. 12 ఓవర్లకు అఫ్గాన్ స్కోరు 110/3. రహ్మానుల్లా (86) సెంచరీ దిశగా సాగుతున్నాడు. హష్మతుల్లా షాహిదీ (17) పరుగులతో ఉన్నాడు. భారత్‌తో జరుగుతున్న తొలి వన్డేలో అఫ్గానిస్థాన్ ఓపెనర్ రహ్మానుల్లా గుర్బాజ్ దూకుడుగా ఆడుతున్నాడు. ప్రసిద్ధ్ కృష్ణ వేసిన ఏడో ఓవర్లో రెండు ఫోర్లు, హర్ష్ దూబె బౌలింగ్‌లో ఫోర్, సిక్స్ బాదాడు. మళ్లీ ప్రసిద్ధ్ బౌలింగ్‌లో గుర్బాజ్ వరుసగా రెండు ఫోర్లు రాబట్టాడు. హర్ష్ దూబె వేసిన తర్వాతి ఓవర్లో సిక్స్ కొట్టి 25 బంతుల్లో అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. 10 ఓవర్లకు అఫ్గాన్ స్కోరు 79/3. రహ్మానుల్లా (57), హష్మతుల్లా షాహిదీ (16) క్రీజులో ఉన్నారు. అఫ్గానిస్థాన్‌తో జరుగుతున్న తొలి వన్డేలో భారత బౌలర్లు అదరగొడుతున్నారు. అర్ష్‌దీప్ బౌలింగ్‌లో రహ్మత్ షా (3).. హర్ష్ దూబెకు క్యాచ్ ఇచ్చాడు. ఈ మ్యాచ్‌లో అర్ష్‌దీప్ సింగ్‌కు ఇది రెండో వికెట్. 5 ఓవర్లకు అఫ్గాన్ 27/3. ఓపెనర్ రహ్మానుల్లా గుర్బాజ్ (20) నిలకడగా ఆడుతున్నాడు. హష్మతుల్లా షాహిదీ (1) క్రీజులో ఉన్నాడు. భారత్, అఫ్గాన్ మధ్య తొలి వన్డే మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన అఫ్గానిస్థాన్‌కు ఆరంభంలోనే గట్టి షాక్‌లు తగిలాయి. అరంగేట్ర బౌలర్ గుర్నూర్ బ్రార్ తన తొలి ఓవర్‌లోనే ఇబ్రహీం జద్రాన్ (1)ని ఔట్ చేశాడు. జద్రాన్ గిల్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. తర్వాత అర్ష్‌దీప్ సింగ్ బౌలింగ్‌లో సెదికుల్లా అటల్ (0) ఎల్బీడబ్ల్యూగా పెవిలియన్ చేరాడు. 2.3 ఓవర్లకు అఫ్గాన్ స్కోరు 16/2. భారత్, అఫ్గాన్ మధ్య తొలి వన్డే మ్యాచ్‌కు ధర్మశాల వేదిక. టాస్ గెలిచిన టీమ్‌ఇండియా బౌలింగ్ ఎంచుకుంది. వరుణుడి అంతరాయంతో మ్యాచ్‌ను 25 ఓవర్లకు కుదించారు. ఈ మ్యాచ్‌తో భారత్ తరఫున గుర్నూర్ బ్రార్, హర్ష్ దూబె అరంగేట్రం చేశారు. భారత్ తుది జట్టు ఇదే: శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, కేఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్ (వికెట్‌కీపర్), వాషింగ్టన్ సుందర్, నితీష్ కుమార్ రెడ్డి, హర్ష్ దూబె, గుర్నూర్ బ్రార్, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ.








# ఈ వీకెండ్ ఓటీటీలో థ్రిల్లింగ్ మూవీస్



సూర్య వశిష్ఠ, దీప్షికా చంద్రన్ జంటగా నటించిన సినిమా 'రమణి కల్యాణం'. విజయ్ ఆదిరెడ్డి దర్శకుడు. మేలో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ మూవీ ఇప్పుడు 'ఈటీవీ విన్' వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది.

ఓటీటీ ప్రేక్షకులను థ్రిల్ చేసేందుకు మరో మలయాళ మూవీ సిద్ధంగా ఉంది. షేన్ నిగమ్ ప్రధాన పాత్రలో దర్శకుడు మార్టిన్ జోసెఫ్ తెరకెక్కించిన తాజా చిత్రం 'దృఢం'. ప్రస్తుతం 'జియో హాట్‌స్టార్'లో స్ట్రీమింగ్ అవుతోంది.

సూర్య, త్రిష ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కరుప్పు'. తెలుగులో 'వీరభద్రుడు'గా విడుదలైంది. ఆర్జే బాలాజీ తెరకెక్కించిన ఈ సినిమా ఇప్పుడు ఓటీటీలోకి వచ్చేసింది. అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతోంది. (రివ్యూ కోసం క్లిక్‌చేయండి)

'పాతాళ్ లోక్'తో థ్రిల్ చేసిన దర్శకుడు ప్రొసిత్ రాయ్. ఆయన దర్శకత్వంలో వచ్చిన తాజా వెబ్‌సిరీస్ 'రాఖ్'. అలీ ఫజల్, సోనాలి బింద్రే, ఆమిర్ బషీర్ కీలక పాత్రల్లో నటించారు. ఇద్దరు టీనేజర్ల మిస్సింగ్ కేసును పోలీసు ఆఫీసర్ ఎలా ఛేదించాడన్నది క్లుప్తంగా ఈ సిరీస్ కథాంశం. పలు వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ సిరీస్ రూపొందింది.

# అలాంటి పాత్ర కోసమే నా ఎదురుచూపు: కీర్తి

కొత్తదనం నిండిన కథలతో ప్రేక్షకుల్ని అలరిస్తుంటుంది కథానాయిక కీర్తి సురేశ్. ఆమె గతేడాది 'రివాల్వర్ రీటా', 'ఉప్పుకప్పురంబు' లాంటి చిత్రాలతో సందడి చేసినా.. అవి సినీప్రియుల్ని అంతగా ఆకట్టుకోలేదు. ప్రస్తుతం పలు భాషలలో వరుస చిత్రాలతో బిజీగా గడుపుతున్న ఈ తార 'మహానటి' లాంటి పాత్రలు కావాలని అంటోంది. ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కీర్తి.. భవిష్యత్ పాత్రలు, 'మహానటి' చిత్రం గురించి గుర్తు చేసుకుంది. "'మహానటి' నా జీవితాన్నే మార్చేసిన సినిమా. కెరీర్ ప్రారంభంలోనే ప్రముఖ నటి సావిత్రి పాత్రను పోషించడానికి ఎంతో భయపడ్డాను. ఆ సమయంలో నేను సాధారణ పాత్ర చేయట్లేదని నాకు తెలుసు. కానీ ఈ చిత్రం నన్ను అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టింది. ఇటీవలి కాలంలో నాకు మళ్లీ అలాంటి విజయం దక్కలేదు. ప్రస్తుతం నేను 'మహానటి' లాంటి శక్తిమంతమైన పాత్రల కోసమే ఎదురుచూస్తున్నా" అని తన మనసులోని మాటల్ని బయటపెట్టింది కీర్తి.



# ఓటీటీలోకి 'దృశ్యం 3'.. ఎక్కడ? ఎప్పుడు?




మలయాళ స్టార్ హీరో మోహన్‌లాల్ నటించిన సస్పెన్స్ థ్రిల్లర్ 'దృశ్యం 3' ఓటీటీ విడుదల తేదీ ఖరారైంది. థియేటర్లలో సక్సెస్ టాక్ తెచ్చుకున్న ఈ చిత్రం జూన్ 18 నుంచి ప్రముఖ ఓటీటీ వేదిక ప్రైమ్ వీడియోలో స్ట్రీమ్ కానుంది. మే 21న విడుదలైన ఈ చిత్రం నెల రోజులు పూర్తికాకముందే డిజిటల్ ప్రేక్షకుల ముందుకు రానుంది. 'దృశ్యం 3' డిజిటల్ హక్కులను నిర్మాణ సంస్థ ఆశీర్వాద్ సినిమాస్ నుంచి ప్రైమ్ వీడియో సొంతం చేసుకుంది. ఈ చిత్రం మలయాళంతో పాటు తెలుగు, తమిళ, కన్నడ భాషల్లోనూ అందుబాటులోకి రానుంది. భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా 200కుపైగా దేశాల్లో ఒకేసారి స్ట్రీమ్ చేయనున్నారు. దర్శకుడు జీతూ జోసెఫ్ ఈసారి కథను కొత్త కోణంలో ఆవిష్కరించారు. గత రెండు భాగాల మాదిరిగా వరుస ట్విస్టులపై కాకుండా జార్జ్‌కుట్టి పాత్ర ఎదుర్కొనే నైతిక సంఘర్షణలు, కుటుంబాన్ని కాపాడేందుకు అతడు ఎంతదూరమైనా వెళ్లే పరిస్థితులను ప్రధానంగా చూపించారు. బాక్సాఫీస్ వద్ద కూడా 'దృశ్యం 3' భారీ విజయాన్ని నమోదు చేసింది. ప్రపంచవ్యాప్తంగా రూ.234.97 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన ఈ చిత్రం విదేశాల్లోనే రూ.111.50 కోట్ల గ్రాస్ కలెక్షన్లు రాబట్టింది. భారత్‌లో రూ.123 కోట్లకు పైగా వసూళ్లు సాధించి అత్యధిక కలెక్షన్స్ సాధించిన మలయాళ చిత్రాల్లో రెండో స్థానాన్ని దక్కించుకుంది. మోహన్‌లాల్‌తో పాటు మీనా, ఎస్తేర్ అనిల్, అన్సిబా హసన్, సిద్ధిఖ్, ఆశా శరత్, మురళీ గోపీ తదితరులు కీలక పాత్రలు పోషించారు.



# రొమాంటిక్ హారర్ చిత్రంలో సయామీ

'మేజర్', 'స్కంద' వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలైన నటి సయామీ మంజ్రేకర్, తాను నటిస్తున్న తాజా చిత్రం 'ఇకాయ్' తన కెరీర్‌లోనే అత్యంత సవాలుతో కూడుకున్నదని తెలిపారు. రాఘవ్ జుయల్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ రొమాంటిక్ హారర్ సినిమా కోసం తాను ఎంతో శ్రమించాల్సి వచ్చిందని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ దశలో ఉంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో సయామీ మంజ్రేకర్ మాట్లాడుతూ, "ఇప్పటివరకు నేను చేసిన సినిమాల్లో 'ఇకాయ్' నాకు అతిపెద్ద సవాలు విసిరింది. షూటింగ్ సమయంలో కొన్నిసార్లు నా కంఫర్ట్ జోన్ దాటి నటించాల్సి వచ్చింది. కొన్ని సన్నివేశాల్లో సహజమైన భావోద్వేగాలను పండించడం కష్టంగా అనిపించినప్పటికీ, ఇలాంటి అనుభవాలే ఒక నటిగా నన్ను మెరుగుపరుస్తాయని నమ్ముతున్నాను," అని వివరించారు. ఈ చిత్రంలో తన నటనలోని కొత్త కోణాన్ని ప్రేక్షకులు చూస్తారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. రాజ్ సింగ్ చౌదరి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా షూటింగ్ ఇటీవలే ముంబైలోని కొలాబా ప్రాంతంలో జరిగింది. యాక్షన్, డ్రామా తరహా పాత్రలకు భిన్నంగా ఓ రొమాంటిక్ హారర్ కథలో నటించడం తన కెరీర్‌కు ప్లస్ అవుతుందని సయామీ భావిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న 'ఇకాయ్' చిత్రాన్ని 2027 ప్రథమార్ధంలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

# బిగ్ బాస్ హౌస్‌లోకి వెళ్లాలనుందా?..



తెలుగు టెలివిజన్ ప్రేక్షకులను దశాబ్ద కాలంగా అలరిస్తున్న అతిపెద్ద రియాలిటీ షో 'బిగ్ బాస్' మరో కొత్త సీజన్‌తో సందడి చేసేందుకు సిద్ధమైంది. ఇప్పటికే తొమ్మిది సీజన్లను విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ షో, ఇప్పుడు పదో సీజన్‌కు రంగం సిద్ధం చేస్తోంది. ఈ సీజన్‌కు కూడా కింగ్ అక్కినేని నాగార్జునే హోస్ట్‌గా వ్యవహరించనున్నట్లు అధికారిక ప్రోమో ద్వారా నిర్వాహకులు స్పష్టం చేశారు. నాగార్జున తనదైన శైలిలో షోను నడిపించేందుకు మరోసారి సిద్ధం కావడంతో అభిమానుల్లో అంచనాలు భారీగా పెరిగాయి. గత సీజన్‌లో ప్రవేశపెట్టిన 'అగ్నిపరీక్ష' కాన్సెప్ట్‌కు అద్భుతమైన స్పందన లభించిన సంగతి తెలిసిందే. సెలబ్రిటీలతో పాటు సామాన్య ప్రజలకు కూడా బిగ్ బాస్ హౌస్‌లో అడుగుపెట్టే అవకాశం కల్పించడం ద్వారా షోకు కొత్త ఊపు వచ్చింది. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో, ఇప్పుడు పదో సీజన్‌లో కూడా అదే ఫార్ములాను కొనసాగించాలని నిర్వాహకులు నిర్ణయించారు. ఇందులో భాగంగా 'అగ్నిపరీక్ష సీజన్ 2'ను అధికారికంగా ప్రకటించారు. తమలోని ప్రతిభను, ప్రత్యేకతను ప్రపంచానికి చూపించాలనుకునే సామాన్యులకు ఇది మరో సువర్ణావకాశం. బిగ్ బాస్ హౌస్‌లోకి వెళ్లాలనే కల ఉన్నవారు ఈ అగ్నిపరీక్షలో పాల్గొనవచ్చు. ఇందుకోసం తమ వ్యక్తిత్వాన్ని, టాలెంట్‌ను ప్రదర్శిస్తూ ఒక ఆడిషన్ వీడియోను రూపొందించి పంపించాల్సి ఉంటుంది. తాము బిగ్ బాస్‌కు ఎందుకు అర్హులో ఆ వీడియోలో స్పష్టంగా వివరించాలి. ఈ ఆడిషన్ల ప్రక్రియ జూన్ 12న ప్రారంభమై జూన్ 20 వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ గడువులోగా ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ వీడియోలను పంపించవచ్చు. ప్రతి సీజన్‌లో ఊహించని ట్విస్టులు, కొత్త టాస్కులు, భావోద్వేగాలతో ప్రేక్షకులను కట్టిపడేసే బిగ్ బాస్.. పదో సీజన్‌లో ఎలాంటి కొత్త అంశాలతో ముందుకు వస్తుందోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది. 'అగ్నిపరీక్ష 2' ద్వారా ఎంపికయ్యే సామాన్యులు ఎవరు, సెలబ్రిటీ కంటెస్టెంట్లుగా ఎవరు రాబోతున్నారు అనే అంశాలపై అప్పుడే చర్చ మొదలైంది. మరికొన్ని రోజుల్లోనే ఈ షోకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.



# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 14-06-2026 | సంపుటి - 29 | సంచిక -20 | రూ : 4 | పేజీలు: 8



## సింగరేణి ప్రైవేటీకరణకు

# భాజపా, భారాసల కుట్ర

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ఆదిలాబాద్, మంచిర్యాల పట్టణం, దండేపల్లి గ్రామీణం: భారాస పదేళ్ల పాలనలో కేంద్రంలోని భాజపా ప్రభుత్వంతో కలిసి సింగరేణి సంస్థను ప్రైవేటుపరం చేసేందుకు కుట్రలు చేసిందని, తాము అధికారంలోకి వచ్చాక వాటిని అడ్డుకోవడంతో మాపై బురదజల్లే ప్రయత్నం చేస్తోందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మండిపడ్డారు. మాజీ మంత్రి హరీశ్‌రావు అబద్ధాలరావుగా మారారని ఎద్దేవాచేశారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సింగరేణికి రావాల్సిన వాటాలను ప్రైవేటు సంస్థలకు చెందేలా ప్రయత్నాలు చేశారని ఆరోపించారు. మంచిర్యాలలో శనివారం సాయంత్రం మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్,

తరువాయి 2లో



# 1.44 లక్షల మందికి బ్రేక్‌ఫాస్ట్



- తొలి విడతలో 1,269 పాఠశాలలు... 33 కళాశాలల్లో అమలు
- రేపు 8 జిల్లాల్లో ప్రారంభం
- హరే కృష్ణ మూమెంట్... మన్నా ట్రస్ట్‌లకు బాధ్యతలు

హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో బ్రేక్‌ఫాస్ట్ పథకానికి ఈ నెల 15న రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. అందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. తొలి విడత మొత్తం 1,302 విద్యాసంస్థల్లో ప్రారంభించనుంది. అందులో 1,269 పాఠశాలలు, 33 కళాశాలలు ఉన్నాయి. వాటిల్లోని మొత్తం 1,44,610 మంది విద్యార్థులకు వారంలో ఆదివారం మినహా మిగిలిన ఆరు రోజులు ఉదయం పూట అల్పాహారం అందనుంది. పథకాన్ని సెంట్రలైజ్డ్ కిచెన్ల ద్వారా విడతల వారీగా కొత్త విద్యా సంవత్సరంలోనే రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అమలు చేస్తారు. మొత్తం 33 జిల్లాల్లో 39 చోట్ల కేంద్రీకృత కిచెన్ల నిర్మాణానికి రూ.299.90 కోట్లు ఖర్చవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది.

తరువాయి 2లో

## జీ7 వేదికగా మోదీ, ట్రంప్ భేటీ..

# ఈ నెల 17న కీలక చర్చలు



- జీ7 సదస్సులో భాగంగా ప్రధాని మోదీ, ట్రంప్ భేటీ
- జూన్ 17న ఫ్రాన్స్‌లో ఇరువురు నేతల సమావేశం
- ద్వైపాక్షిక వాణిజ్యం, ప్రాంతీయ భద్రతపై చర్చల అంచనా
- భారత నావికుల మృతి సహా పలు ఉద్రిక్తతల నడుమ ఈ భేటీ

2లో

## పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌లో

# తెలంగాణ పోలీసులకు జాతీయ పురస్కారం



2లో

- పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌లో తెలంగాణ పోలీసులకు జాతీయ అవార్డు
- కేంద్ర విదేశాంగ శాఖ నుంచి ప్రతిష్ఠాత్మక పురస్కారానికి ఎంపిక
- 'వెరిఫాస్ట్' యాప్ ద్వారా వేగవంతమైన సేవలకు గుర్తింపు
- జూన్ 19న అవార్డు అందుకోనున్న డీజీపీ సీవీ ఆనంద్

## భారత సైన్యానికి కొత్త చీఫ్‌గా


# లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్

- కొత్త ఆర్మీ చీఫ్‌గా ధీరజ్ సేథ్
- జూన్ 30న బాధ్యతల స్వీకరణ
- ఉపేంద్ర ద్వివేది అదే రోజు రిటైర్
- 1986లో సైన్యంలో చేరిన సేథ్
- పలు కీలక కమాండ్లకు నాయకత్వం
- సైన్యం ఆధునికీకరణలో కీలక పాత్ర

2లో




# నేడే ఒప్పందం



డొనాల్డ్ ట్రంప్ | షెహబాజ్ షరీఫ్ | అబ్బాస్ అరాగ్చీ

- తెరుచుకోనున్న హర్మూజ్ జల సంధి
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన
- అంతకుముందు పాక్ ప్రధాని నోటా అదే మాట
- ఇరాన్ నుంచీ సానుకూల సంకేతాలు
- అయితే అమెరికా వైఖరిని బట్టి తదుపరి నిర్ణయం ఉంటుందని స్పష్టీకరణ

2లో




## భారత్ అరుదైన ఘనత..

# ఖండాంతర క్షిపణులనూ అడ్డుకునే సామర్థ్యం!

2లో

- ఐసీబీఎం స్థాయి ముప్పును అడ్డుకునే సామర్థ్యం భారత్ సొంతం
- వరుసగా మూడు BMD ఫ్లైట్ టెస్టులు సక్సెస్
- ఈ సామర్థ్యం ఉన్న అతికొన్ని దేశాల జాబితాలో భారత్
- నేవల్ యాంటీషిప్ మిసైల్ తొలి పరీక్ష విజయవంతం

# సింగరేణి ప్రైవేటీకరణకు భాజపా, భారాసల కుట్ర

*** డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

మంచిర్యాల గ్రామీణం: భారాస పదేళ్ల పాలనలో కేంద్రంలోని భాజపా ప్రభుత్వంతో కలిసి సింగరేణి సంస్థను ప్రైవేటుపరం చేసేందుకు కుట్రలు చేసిందని, తాము అధికారంలోకి వచ్చాక వాటిని అడ్డుకోవడంతో మాపై బురదజల్లే ప్రయత్నం చేస్తోందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మండిపడ్డారు. మాజీ మంత్రి హరీశ్‌రావు అబద్ధాలరావుగా మారారని ఎద్దేవాచేశారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సింగరేణికి రావాల్సిన వాటాలను ప్రైవేటు సంస్థలకు చెందేలా ప్రయత్నాలు చేశారని ఆరోపించారు. మంచిర్యాలలో శనివారం సాయంత్రం మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, సింగరేణి సీఎండీ బుద్ధ ప్రకాశ్‌జ్యోతితో కలిసి 335 మంది సింగరేణి కార్మికుల వారసులకు కారుణ్య నియమాక పత్రాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. 'కిషన్‌రెడ్డికి తెలంగాణపై ప్రేమ ఉంటే 2023లో తాడిచెర్ల2 బ్లాక్ సింగరేణికి దక్కేలా చూసేవారు. ఈ విషయంపై నేనే లేఖ రాసి, పలుమార్లు స్వయంగా కలిస్తే స్పందించకపోగా.. సత్తుపల్లి 3, కోల్‌బ్లాక్ 3, కొయ్యగూడ వేలంలో కూడా సింగరేణి పాల్గొనకుండా చేశారు. ఆయనకు అనుకూలమైన ఇద్దరు ప్రైవేటు వ్యక్తుల కోసం సింగరేణి రూ.9,746 కోట్ల లాభం కోల్పోయేలా కుట్రపూరితంగా వ్యవహరించారు. దీనిని లెక్కాపత్రాలతో నిరూపించడానికి నేను సిద్ధం. ఎట్టి పరిస్థితుల్లో సింగరేణిని ప్రైవేటుపరం కానివ్వం. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం కొలువుదీరిన తర్వాత రూ.1.25 కోట్ల చొప్పున సింగరేణి కార్మికులకు ప్రమాద బీమా ప్రకటించాం. సంస్థ లాభాల్లో రెగ్యులర్ కార్మికులతోపాటు కాంట్రాక్టు కార్మికులకు కూడా బోనస్ అందించేలా విధానపరమైన నిర్ణయం తీసుకున్నాం. భాజపా రాజ్యాంగాన్ని, ఎన్నికల సంఘాన్ని ప్రభావితం చేస్తోంది. వారికి నచ్చిన వారినే గెలిపించేలా దాన్ని తయారు చేస్తోంది. మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరించటం అందులో భాగమే. ప్రజాస్వామ్యానికి ఇది ప్రమాద ఘంటిక' అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు అధ్యక్షత వహించగా ఎంపీ వంశీకృష్ణ, ఎమ్మెల్సీలు దండె విఠల్, ఎమ్మెల్యేలు వినోద్, మక్కాన్‌సింగ్, గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ కుమార్‌దీపక్ తదితరులు పాల్గొన్నారు.

## జీ7 వేదికగా మోదీ, ట్రంప్ భేటీ..

# ఈ నెల 17న కీలక చర్చలు

భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫ్రాన్స్‌లో సమావేశం కానున్నారు. జీ7 శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ఈ నెల 17న వీరిద్దరి మధ్య ద్వైపాక్షిక చర్చలు జరగనున్నట్లు వైట్‌హౌస్ శనివారం ధ్రువీకరించింది. పలు అంశాలపై ఇరు దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ భేటీ అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ఆతిథ్యమిస్తున్న జీ7 సదస్సు జూన్ 15 నుంచి 17 వరకు జరగనుంది. ఈ సదస్సుకు భారత్‌ను అతిథ్య దేశంగా ఆహ్వానించారు. ఇందులో పాల్గొనేందుకు ఆరు రోజుల విదేశీ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ ఫ్రాన్స్‌కు చేరుకున్నారు. ఈ పర్యటనలో ఆయన ఫ్రాన్స్, స్లోవేకియా దేశాల్లో పర్యటించనున్నారు. 2025 ఫిబ్రవరిలో ట్రంప్ తిరిగి అమెరికా అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన తర్వాత మోదీ, ట్రంప్‌లు నేరుగా సమావేశం కానుండటం ఇదే తొలిసారి. ఈ భేటీలో ప్రధానంగా ద్వైపాక్షిక వాణిజ్య చర్చలు, ఇంధన సహకారం, ప్రాంతీయ భద్రత వంటి అంశాలు ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉంది. అయితే, ఈ సమావేశంలో తక్షణమే భారీ వాణిజ్య ఒప్పందాలు కుదిరే సూచనలు లేవని అమెరికా అధికారులు తెలిపారు. ఈ చర్చల అనంతరం అమెరికా వాణిజ్య ప్రతినిధి జేమిసన్ గ్రీర్ భారత్‌లో పర్యటించనున్నారు. ఇటీవల కాలంలో ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు కొంత క్లిష్టంగా మారాయి. భారత ఎగుమతులపై అమెరికా విధిస్తున్న సుంకాలు, రష్యా నుంచి భారత్ ఇంధన కొనుగోళ్లు వంటి అంశాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా, ఒమన్ తీరంలో అమెరికా చేపట్టిన చర్యల కారణంగా ముగ్గురు భారతీయ నావికులు ప్రాణాలు కోల్పోవడంపై భారత్ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో జరగనున్న ఈ భేటీ, ఇరు దేశాల మధ్య సంబంధాలను పునరుద్ధరించి, తిరిగి గాడిన పెట్టడానికి ఒక కీలక అవకాశంగా విశ్లేషకులు భావిస్తున్నారు.

# 1.44 లక్షల మందికి బ్రేక్‌ఫాస్ట్

హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో బ్రేక్‌ఫాస్ట్ పథకానికి ఈ నెల 15న రాష్ట్రప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. అందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. తొలి విడత మొత్తం 1,302 విద్యాసంస్థల్లో ప్రారంభించనుంది. అందులో 1,269 పాఠశాలలు, 33 కళాశాలలు ఉన్నాయి. వాటిల్లోని మొత్తం 1,44,610 మంది విద్యార్థులకు వారంలో ఆదివారం మినహా మిగిలిన ఆరు రోజులు ఉదయం పూట అల్పాహారం అందనుంది. పథకాన్ని సెంట్రలైజ్డ్ కిచెన్ల ద్వారా విడతల వారీగా కొత్త విద్యా సంవత్సరంలోనే రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అమలు చేస్తారు. మొత్తం 33 జిల్లాల్లో 39 చోట్ల కేంద్రీకృత కిచెన్ల నిర్మాణానికి రూ.299.90 కోట్లు ఖర్చవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. అందులో ఇప్పటికే ఉన్న 7 కిచెన్లను ఉన్నతీకరిస్తారు. మిగిలినవి కొత్తగా నిర్మిస్తారు. ఒక్కో కిచెన్‌కు ప్రభుత్వం తన వాటాగా 70% భర్తిస్తుంది. మిగిలిన 30% మొత్తాన్ని ఆయా స్వచ్ఛంద సంస్థలు ఖర్చు చేయనున్నాయి. కిచెన్ల నిర్మాణ బాధ్యతలను తెలంగాణ విద్యా సంక్షేమ, మౌలికాభివృద్ధి సంస్థ పర్యవేక్షిస్తుంది. ఇప్పటికే టెండర్లు ఖరారయ్యాయి.

- 22 లక్షలు: బ్రేక్‌ఫాస్ట్ పథకంతో లబ్ధి పొందనున్న రాష్ట్రంలోని మొత్తం ప్రీ ప్రైమరీ (పూర్వ ప్రాథమిక) నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థుల సంఖ్య.
- రూ.720 కోట్లు: పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్ కోసం చేయనున్న ఖర్చు. వీటిలో అల్పాహారానికి రూ.540 కోట్లు, పాలకు రూ.180 కోట్లు.
- రూ.56 కోట్లు: ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేకంగా కేటాయించిన మొత్తం ఇది.
- పాలు/రాగి జావ: మూడు రోజులు పాలు, మరో మూడు రోజులు రాగి జావ ఇవ్వనున్నారు. ప్రీ ప్రైమరీ నుంచి 5వ తరగతి వరకు 75 మి.లీ., మిగిలిన తరగతుల వారికి 100 మి.లీ. చొప్పున పాలు అందజేస్తారు.
- 2 సంస్థలు... 8 జిల్లాలు: బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని హరే కృష్ణ మూమెంట్ ఛారిటబుల్ ట్రస్ట్, మన్నా ట్రస్ట్‌లు మొత్తం ఎనిమిది జిల్లాల్లో అమలు చేయనున్నాయి.
- హరే కృష్ణ మూమెంట్: వికారాబాద్, నారాయణపేట, సంగారెడ్డి, రంగారెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లాల్లోని 1,162 పాఠశాలల్లో...1,03,891 మంది విద్యార్థులు ప్రయోజనం పొందుతారు. వికారాబాద్, నారాయణపేట, హనుమకొండ, వరంగల్ జిల్లాల్లోని 21 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని 10,293 మందికి కూడా బ్రేక్‌ఫాస్ట్ అందుతుంది.
- మన్నా ట్రస్ట్: హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాల్లోని 107 పాఠశాలల్లో చదివే 26,294 మంది విద్యార్థులకు అందుతుంది. ఈ రెండు జిల్లాల్లో 12 కళాశాలల్లోని 4,132 మందికి కూడా లభిస్తుంది.

**> జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజనం**

- ప్రస్తుతం పాఠశాలలకే పరిమితమైన మధ్యాహ్న భోజన పథకాన్ని ఇక నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలలకూ విస్తరించనున్నారు. ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ఈ పథకం వర్తిస్తుంది. దీన్ని కూడా సోమవారం నుంచే 33 కళాశాలల్లో ప్రారంభిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 430 ప్రభుత్వ కళాశాలలున్నాయి. వాటిల్లో దాదాపు 1.70 లక్షల మంది చదువుతున్నారు.

## పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌లో

# తెలంగాణ పోలీసులకు జాతీయ పురస్కారం

తెలంగాణ పోలీసు శాఖ మరో ప్రతిష్ఠాత్మక జాతీయ పురస్కారాన్ని సొంతం చేసుకుంది. పాస్‌పోర్ట్ దరఖాస్తుల వెరిఫికేషన్ ప్రక్రియలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు గాను కేంద్ర విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలంగాణ పోలీసులను 'ఇన్‌స్టిట్యూషనల్ పెర్ఫార్మెన్స్ అవార్డ్ ఫర్ స్టేట్ పోలీస్ (2025 26)'కు ఎంపిక చేసింది. పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ ప్రక్రియను అత్యంత సమర్థవంతంగా, పారదర్శకంగా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వేగంగా పూర్తి చేస్తున్నందుకు ఈ గుర్తింపు లభించింది. ఈ నెల 19న ఢిల్లీలో నిర్వహించనున్న 'పాస్‌పోర్ట్ సేవా దివస్' వేడుకల్లో కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ చేతుల మీదుగా రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. తెలంగాణ పోలీసులు వెరిఫికేషన్ ప్రక్రియ కోసం ప్రత్యేకంగా రూపొందించిన 'వెరిఫాస్ట్' మొబైల్ యాప్‌ను వినియోగిస్తున్నారు. ఈ యాప్ ద్వారా దరఖాస్తుల పరిశీలనలో జాప్యాన్ని గణనీయంగా తగ్గించడంతో పాటు, ప్రక్రియ అంతటా పారదర్శకతను పెంచారు. జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకున్న ఈ వినూత్న విధానం, పౌర సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో తెలంగాణ పోలీసుల అంకితభావానికి నిదర్శనంగా నిలుస్తోంది.

# భారత సైన్యానికి కొత్త చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్

భారత సైన్యానికి కొత్త ఆర్మీ చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్‌ను కేంద్ర ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఆయన వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జూన్ 30న కొత్త ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది అదే రోజు పదవీ విరమణ చేయనున్నారు. దీంతో ధీరజ్ సేథ్ భారత సైన్యానికి తదుపరి అధిపతిగా బాధ్యతలు చేపట్టనున్నారు. సేథ్ నేషనల్ డిఫెన్స్ అకాడమీలో శిక్షణ పొందారు. 1986 డిసెంబర్‌లో ఆర్మర్డ్ కార్ప్స్‌లో అధికారిగా సైన్యంలో చేరారు. దాదాపు 40 ఏళ్లకు పైగా సాగిన సైనిక జీవితంలో కీలక బాధ్యతలు నిర్వహించారు. ఎడారి ప్రాంతాల్లో ఆర్మర్డ్ రెజిమెంట్‌కు నాయకత్వం వహించిన ధీరజ్ సేథ్, పశ్చిమ సరిహద్దు ప్రాంతంలో ఆర్మ్‌డ్ బ్రిగేడ్‌కు కమాండర్‌గా పనిచేశారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలను పర్యవేక్షించే దళాలకు కూడా నాయకత్వం అందించారు. లెఫ్టినెంట్ జనరల్ హోదాలో భారత సైన్యంలో అత్యంత కీలకమైన స్ట్రైక్ ఫార్మేషన్లలో ఒకటైన సుదర్శన్ చక్ర కార్ప్స్‌కు కమాండర్‌గా వ్యవహరించారు. ఢిల్లీ ప్రాంత జనరల్ ఆఫీసర్ ఇన్ కమాండింగ్‌గా కూడా పనిచేశారు. ఈ సమయంలో దేశీయ, అంతర్జాతీయ సైనిక కార్యక్రమాల సమన్వయం బాధ్యతలు నిర్వర్తించారు. సైన్యాన్ని ఆధునిక అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడంలో ధీరజ్ సేథ్ కీలక పాత్ర పోషించారు. సైనిక సామర్థ్యాల పెంపు, భవిష్యత్ వ్యూహాల రూపకల్పన, దళాల పునర్వ్యవస్థీకరణ వంటి అంశాల్లో ఆయన సేవలు విశేష గుర్తింపు పొందాయి.

## భారత్ అరుదైన ఘనత..

# ఖండాంతర క్షిపణులనూ అడ్డుకునే సామర్థ్యం!

రక్షణ రంగంలో భారత్ మరో కీలక మైలురాయిని చేరుకుంది. దీర్ఘశ్రేణి బాలిస్టిక్ క్షిపణులను గాల్లోనే అడ్డుకుని ధ్వంసం చేసే సామర్థ్యాన్ని డీఆర్‌డీఓ విజయవంతంగా పరీక్షించింది. సముద్రంలో శత్రు నౌకలను లక్ష్యంగా చేసుకొనే కొత్త క్షిపణి సామర్థ్యాన్నీ ప్రదర్శించింది. వరుసగా నిర్వహించిన మూడు ప్రయోగాత్మక పరీక్షలు విజయవంతం కావడంతో అత్యాధునిక క్షిపణి రక్షణ వ్యవస్థలు కలిగిన దేశాల సరసన భారత్ నిలిచింది. డీఆర్‌డీఓ నిర్వహించిన మూడు వరుస పరీక్షల్లో ఇంటర్‌సెప్టర్ క్షిపణులు తమ లక్ష్యాలను కచ్చితంగా ఛేదించాయి. బహుళస్థాయి బాలిస్టిక్ మిసైల్ డిఫెన్స్ వ్యవస్థ సామర్థ్యాన్ని ఈ పరీక్షలు నిరూపించాయి. ఆధునిక క్షిపణి ముప్పులను ఎదుర్కొనేలా రూపొందించిన ఈ వ్యవస్థ శత్రు బాలిస్టిక్ క్షిపణులను లక్ష్యానికి చేరకముందే నిర్వీర్యం చేయగలదని అధికారులు తెలిపారు. ఈ విజయాలతో భారత్ ప్రపంచంలోని కొన్ని దేశాలకే ఉన్న ప్రత్యేక సామర్థ్యాన్ని సొంతం చేసుకుంది. ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులు (ఐసీబీఎంలు) సహా అత్యంత ప్రమాదకరమైన క్షిపణి ముప్పును అడ్డుకునే రక్షణ వ్యవస్థను అభివృద్ధి చేసిన దేశాల జాబితాలో భారత్ చేరిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఇది దేశ భద్రతా వ్యవస్థకు కీలక బలాన్ని చేకూర్చనుంది. మరోవైపు నేవల్ యాంటీషిప్ మిసైల్ (మీడియం రేంజ్) తొలి ఫ్లైట్ టెస్ట్‌ను కూడా డీఆర్‌డీఓ విజయవంతంగా పూర్తి చేసింది. మధ్యశ్రేణి దూరంలో శత్రు యుద్ధ నౌకలను కచ్చితంగా లక్ష్యంగా చేసుకునే ఈ క్షిపణి భారత నౌకాదళ దాడి సామర్థ్యాన్ని మరింత పెంచనుంది. ఈ విజయాలపై డీఆర్‌డీఓ శాస్త్రవేత్తలను రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు.



## డ్రైవర్ గా మారిన సీఎం..

# 130 కిలోమీటర్లు డ్రైవ్ చేసిన విజయ్

తమిళనాడు రాజకీయాల్లో సంచలన విజయం సాధించి, ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించిన కోలీవుడ్ స్టార్ విజయ్ తనదైన స్టైల్‌తో అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు. పరిపాలన చేపట్టిన కొన్ని రోజులకే తన అసాధారణమైన శైలితో వార్తల్లో నిలుస్తున్నారు. తాజాగా నిన్న ఆయన కర్ణాటకలోని ప్రముఖ కొల్లూరు మూకాంబిక అమ్మవారి ఆలయాన్ని సందర్శించిన సంగతి తెలిసిందే. అయితే, అక్కడ దర్శనం ముగించుకున్న తర్వాత ఆయన చేసిన ఒక పని ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. గుడి నుంచి ఎయిర్‌పోర్ట్ వరకు దాదాపు 130 కిలోమీటర్ల మేర తన కారును ఆయనే స్వయంగా డ్రైవ్ చేసుకుంటూ వెళ్లారు. కొల్లూరు మూకాంబిక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన సీఎం విజయ్.. అమ్మవారికి 1.6 కేజీల బరువున్న భారీ వెండి ఖడ్గాన్ని కానుకగా సమర్పించారు. దాంతో పాటు పట్టుచీర, పండ్లు, పూజా సామగ్రిని అందజేశారు. దర్శనం ముగిసిన వెంటనే తన కాన్వాయ్‌లోని కారు డ్రైవింగ్ సీట్లో ఆయనే కూర్చుని ప్రయాణాన్ని ప్రారంభించారు. దారిలో ఒక టోల్ గేట్ వద్ద అభిమానులు ఆయనను గుర్తుపట్టి కేకలు వేయగా.. విజయ్ ఎంతో వినమ్రంగా స్టీరింగ్ పట్టుకునే నవ్వుతూ చేతులూపారు. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట విపరీతంగా వైరల్ అవుతోంది. తమిళనాడు రాజకీయ చరిత్రలో ఈ పర్యటనకు ఒక ప్రత్యేకమైన ప్రాధాన్యత ఉంది. తమిళనాడు ముఖ్యమంత్రి పదవిలో ఉంటూ కొల్లూరు మూకాంబిక ఆలయాన్ని సందర్శించిన మూడో తమిళనాడు సీఎం విజయ్ మాత్రమే. గతంలో తమిళనాడు దిగ్గజ నేతలు ఎం.జి. రామచంద్రన్, జయలలిత మాత్రమే సీఎం హోదాలో ఈ క్షేత్రాన్ని దర్శించుకున్నారు. ఇప్పుడు వారి తర్వాత విజయ్ ఆ సెంటిమెంట్‌ను రిపీట్ చేయడం గమనార్హం. జూన్ 22న విజయ్ తన 52వ పుట్టినరోజును జరుపుకోబోతున్నారు. బర్త్‌డేకి కొన్ని రోజుల ముందే ఈ ఆధ్యాత్మిక పర్యటన పెట్టుకోవడం.. అలాగే ప్రస్తుతం తమిళనాడు కర్ణాటక రాష్ట్రాల మధ్య కావేరి జలాల వివాదం నడుస్తున్న తరుణంలో ఆయన పొరుగు రాష్ట్రానికి వెళ్లడం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది.

# నేడే ఒప్పందం...

వాషింగ్టన్, ఇస్లామాబాద్: పశ్చిమాసియాలో శాంతి పవనాలు వీయనున్నాయా.. అమెరికా ఇరాన్ మధ్య ఘర్షణ ముగియనుందా.. హర్మూజ్ జల సంధి తిరిగి తెరుచుకోనుందా... శనివారం జరిగిన పరిణామాలు ఆ దిశగానే సాగాయి. యుద్ధం ముగియనుందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్‌తో ఆదివారం ఒప్పందం కుదుర్చుకోనున్నామని ప్రకటించారు. సంతకాలూ జరుగుతాయని వెల్లడించారు. ఇరాన్ అణు కార్యక్రమాన్ని కూడా నాశనం చేస్తామని తెలిపారు. అంతకుముందు పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కూడా 24 గంటల్లో శాంతి ఒప్పందం కుదరనుందని ప్రకటించారు. ఇరాన్ మాత్రం ఆచితూచి స్పందిస్తోంది. చర్చలు జరుగుతున్నాయని.. తుది నిర్ణయం అమెరికా వైఖరిని బట్టి ఉంటుందని పేర్కొంది.

### ఆ యురేనియాన్ని నాశనం చేస్తాం

ఇరాన్ అణ్వాయుధ కార్యక్రమాన్ని నాశనం చేసే దిశగా ఒప్పందం ఉంటుందని ట్రంప్ పేర్కొన్నారు. మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా గతంలో కుదుర్చుకున్న అణు ఒప్పందాన్ని తప్పుబట్టారు. 'గతంలో ఒబామా ఇరాన్‌తో కుదుర్చుకున్న ఒప్పందం ఆ దేశం సులభంగా అణ్వాయుధాలు తయారుచేసుకునేలా ఉంది. మా ఒప్పందం మాత్రం ఇందుకు పూర్తి విరుద్ధం. ఆ దేశ అణు కార్యక్రమానికి అడ్డుగోడగా నిలవనుంది' అని చెప్పారు. ఇరాన్ అణ్వాయుధ కార్యక్రమాన్ని ఇప్పటికే పూర్తిగా నిర్వీర్యం చేశామని, వారి దగ్గర ఉన్న శుద్ధి చేసిన యురేనియాన్ని తర్వాతి దశల్లో నాశనం చేస్తామని 'ట్రూత్ సోషల్'లో పేర్కొన్నారు. "సరైన సమయంలో..అంతా ప్రశాంతంగా ఉన్నప్పుడు మేం ఇరాన్‌లోకి ప్రవేశించి గ్రానైట్ పర్వతాల కింద ఉన్న శుద్ధి చేసిన యురేనియాన్ని తీసుకొస్తాం" అని చెప్పారు. ఇరాన్ అణుకేంద్రాలను బి2 బాంబర్లు నాశనం చేశాయని అన్నారు. దానివల్లే యురేనియం ఆ కుప్పకూలిన కొండల కింద చిక్కుకుపోయిందని తెలిపారు. తీసుకొచ్చిన యురేనియాన్ని శుద్ధి చేయని యురేనియంతో కలిపి ఇరాన్‌లో లేదా అమెరికాలో నాశనం చేస్తామని చెప్పారు. ఈ ప్రక్రియ వేగంగా, సులభంగా, ప్రశాంతంగా జరుగుతుందని ఆశిస్తున్నానని చెప్పారు.

### ఆదివారమైతే సంతకం చేయం: ఇరాన్

శాంతి ఒప్పందంపై అంతకుముందు పాకిస్థాన్ కూడా కీలక ప్రకటన చేసింది. రానున్న 24 గంటల్లో ఒప్పందం కుదిరే అవకాశాలున్నాయని ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తెలిపారు 'గతంలో ఎన్నడూ లేనంతగా శాంతికి దగ్గరలో ఉన్నాం. రానున్న 24 గంటల్లో ఒప్పందం ఖరారయ్యే అవకాశాలున్నాయి. ఆ తర్వాత వెంటనే ఒప్పందంపై ఎలక్ట్రానిక్ సంతకాలు చేయించేందుకు మేం సిద్ధమవుతున్నాం. ఈ చరిత్రాత్మక శాంతి ఒడంబడిక సుస్థిర శాంతికి బలమైన పునాదులు వేస్తుందన్న విశ్వాసం మాకుంది' అని 'ఎక్స్'లో షరీఫ్ పేర్కొన్నారు. పాక్ ప్రధాని ప్రకటనను ఇరాన్ పూర్తిగా ఖండించలేదు. 'ఒప్పందంపై రేపు (ఆదివారం) సంతకం చేయబోం. రానున్న రోజుల్లో చేస్తామేమో. పూర్తిగా కొట్టిపారేయలేం. ఎందుకంటే అవతలి పక్షం ఎప్పుడు ఎలా వ్యవహరిస్తుందో తెలియని పరిస్థితి. అందుకే ఈ ప్రక్రియపై ఏ ప్రకటనైనా మేం జాగ్రత్తగా ఇవ్వాలి' అని ఇరాన్ విదేశాంగశాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి ట్రంప్ ప్రకటనకు ముందు తెలిపారు. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ఒప్పందానికి సంబంధించి కీలక వ్యాఖ్యలు చేశారు. లెబనాన్ సహా అన్ని ప్రాంతాల్లో యుద్ధం ముగించే ప్రాథమిక ఒప్పందంపై సంతకాలు చేయడానికి ఇరు పక్షాలు చర్చలు జరుపుతున్నాయని తెలిపారు. ఇందులో ఇరాన్ అణు కార్యక్రమం లేదని అన్నారు. ప్రాథమిక ఒప్పందం కుదిరిన 60 రోజుల తర్వాత అణ్వాయుధాల అంశంపై చర్చలు జరుగుతాయని తెలిపారు. తమ సుప్రీం నేత అలీ ఖమేనీ అంత్యక్రియల ఉరేగింపులు వచ్చే నెల 4న టెహ్రాన్‌లో ప్రారంభమవుతాయని ఇరాన్ ప్రకటించింది. తొమ్మిదో తేదీన అంత్యక్రియలు మషహద్ నగరంలో జరుగుతాయని పేర్కొంది. యుద్ధం ప్రారంభమైన తొలి రోజు (ఫిబ్రవరి 28) అమెరికా, ఇజ్రాయెల్ చేసిన సంయుక్త దాడుల్లో ఖమేనీ ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే.

### రూబియోకు నిరసన తెలిపా: జైశంకర్

అమెరికా సైన్యం నిర్వహించిన దాడుల్లో ముగ్గురు భారతీయ నావికులు చనిపోయిన ఘటనపై తీవ్ర నిరసనను తాను అగ్ర రాజ్య విదేశాంగ మంత్రి మార్కో రూబియోకు తెలిపానని విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి ఎస్.జైశంకర్ శనివారం తెలిపారు. 'రూబియోతో మాట్లాడా. గల్ఫ్ ప్రాంతంలో యూఎస్ నౌకాదళం చేసిన దాడుల్లో ముగ్గురు భారతీయులు మృతి చెందడంపై ఇప్పటికే భారత్ వ్యక్తం చేసిన తీవ్ర ఆందోళనను పునరుద్ఘాటించా' అని ఐరోపా పర్యటనలో ఉన్న మంత్రి తెలిపారు. అయితే హర్మూజ్ జల సంధిపై తాము విధించిన దిగ్బంధనాన్ని ఉల్లంఘించడం తమకు ఆమోదయోగ్యం కాదని ఈ సందర్భంగా రూబియో చెప్పినట్లు అమెరికా విదేశాంగశాఖ తెలిపింది.